





# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 సంచిక : 350 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం శనివారం 23 ఆగస్టు 2025 వెల : 5/-రూ॥


VOLUME :11 ISSUE :350 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM SAT 23 AUGUST 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Prakasam, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur


## చైనాలో కుప్పకూలిన రైల్వే బ్రిడ్జి...

# 12 మంది మృతి

- చైనాలో నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి కూలి ఘోర ప్రమాదం
- యెల్లో రివర్‌పై కుప్పకూలిన రైల్వే వంతెన
- ఘటనలో 12 మంది కార్మికులు మృతి, నలుగురు గల్లంతు
- స్టీల్ కేబుల్ ఫెయిల్ అవడమే కారణమని ప్రాథమిక నిర్ధారణ
- ప్రపంచంలోనే అతిపెద్ద స్టీల్ ట్రస్ ఆర్చ్ బ్రిడ్జిగా గుర్తింపు



వివరాలు 2లో..

## గాజాలో తీవ్ర కరవు నెలకొంది

### అధికారికంగా ప్రకటించిన ఐక్యరాజ్యసమితి

- మధ్యప్రాచ్యంలో కరవును ప్రకటించడం ఇదే మొదటిసారి
- ఐరాస నివేదిక పూర్తిగా అబద్ధమని కొట్టిపారేసిన ఇజ్రాయెల్
- ఇదంతా హమాస్ చేస్తున్న తప్పుడు ప్రచారమని ఇజ్రాయెల్ ఆరోపణ
- వెంటనే కాల్పుల విరమణ జరగకపోతే పరిస్థితి మరింత తీవ్రం కానుందని హెచ్చరిక



వివరాలు 2లో..

## జస్టిస్ సుదర్శన్ రెడ్డి నక్సలిజానికి మద్దతిచ్చారు

### ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డిపై అమిత్ షా తీవ్ర వ్యాఖ్యలు

- ఉపరాష్ట్రపతి ఎన్నికల వేళ వేడెక్కిన రాజకీయాలు
- ఆయన ఇచ్చిన సల్వా జుడుం తీర్పు వల్లే నక్సలిజం పెరిగిందని వెల్లడి
- ఆ తీర్పు లేకపోతే 2020 నాటికే నక్సలిజం అంతమయ్యేదని వ్యాఖ్య
- సుప్రీంకోర్టు వేదికను కాంగ్రెస్ దుర్వినియోగం చేసిందని విమర్శ



వివరాలు 2లో..



## దేశానికే ఆదర్శంగా ఏపీ 'నైపుణ్యం పోర్టల్'

- యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు నైపుణ్యం పోర్టల్
- పరిశ్రమల అవసరాలకు, యువత నైపుణ్యాలకు మధ్య వారధిగా పోర్టల్ ఉండాలన్న లోకేశ్
- దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు ఇంటర్ లో ఎంపీసీ, బైపీసీకి అనుమతించాలని ఆదేశం

పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేం దుకు ప్రభుత్వం తీసుకొస్తున్న 'నైపుణ్యం పోర్టల్'ను దేశానికే ఆదర్శం గా నిలిచేలా రూపొందించాలని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. పరిశ్రమల అవసరాలకు, యువత నైపుణ్యాలకు మధ్య వారధిగా ఈ పోర్టల్ పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. ఉండవల్లిలోని తన నివాసంలో నైపుణ్య అభివృద్ధి శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఈ కీలక ఆదేశాలు జారీ చేశారు. సెప్టెంబర్

వివరాలు 2లో..

# ఎన్డీయేలో ఉన్నాం...

## విపక్షాల అభ్యర్థికి ఎలా మద్దతిస్తాం?

- ఢిల్లీలో ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌తో చంద్రబాబు భేటీ
- రాధాకృష్ణన్‌కు టీడీపీ పూర్తి మద్దతిస్తుందని ప్రకటన
- ఆయన దేశం గౌరవించే వ్యక్తి అని చంద్రబాబు ప్రశంస
- గెలిచే అవకాశం లేకున్నా ఇండియా కూటమి అభ్యర్థిని నిలబెట్టడంపై విమర్శ
- ఎన్డీయేలో ఉంటూ ప్రతిపక్ష అభ్యర్థికి మద్దతివ్వలేమని స్పష్టీకరణ



పెన్ పవర్ డెస్క్:గెలిచే అవకాశం లేదని స్పష్టంగా తెలిసినప్పటికీ, కేవలం రాజకీయాల కోసం ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిని బరిలో నిలుపుతోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు విమర్శిం చారు. ఎన్డీయే కూటమిలో భాగస్వామిగా ఉన్న తెలుగుదేశం పార్టీ, ప్రతిపక్ష అభ్యర్థికి ఎలా మద్దతు ఇస్తుందని ఆయన ప్రశ్నించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న చంద్రబాబు ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌తో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్డీయే భాగస్వామ్య పక్షాలన్నీ ఏకగ్రీవంగా సీపీ రాధాకృష్ణన్‌ను ఎంపిక చేశాయని, ఆయనకు తెలుగుదేశం పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని చంద్రబాబు స్పష్టం చేశారు. రాధాకృష్ణన్ తనకు పాత మిత్రుడని, దేశం గౌరవించదగిన వ్యక్తి అని కొనియాడారు. ఆయన ఉపరాష్ట్రపతి పదవికే వన్నె తెస్తారని, అలాంటి వ్యక్తికి మద్దతు ఇవ్వడం ఆనందంగా ఉందని అన్నారు. "తెలుగుదేశం పార్టీ ఎన్నికలకు ముందు నుంచే ఎన్డీయేలో ఉంది. కేంద్రంలో, రాష్ట్రంలో మేం ఎన్డీయే ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్నాం. అలాంటప్పుడు ప్రతిపక్షాలు మా నుంచి మద్దతు ఆశించడం సరికాదు" అని చంద్రబాబు పేర్కొన్నారు. ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి తెలుగు వ్యక్తి అనే అంశంపై మాట్లాడుతూ, గెలిచే అవకాశం ఉన్నప్పుడే అభ్యర్థిని నిలబెట్టాలని అభిప్రాయపడ్డారు. గతంలో పీవీ నరసింహారావు విషయంలో తెలుగు వ్యక్తి అనే భావనతో కాంగ్రెస్‌లో లేకపోయినా టీడీపీ మద్దతిచ్చిందని, కానీ ప్రస్తుత పరిస్థితులు వేరని ఆయన వివరించారు. కూటమి ధర్మానికి కట్టుబడి ఎన్డీయే అభ్యర్థికే తమ ఓటు ఉంటుందని ఆయన తేల్చిచెప్పారు.

### ఏపీలో ఉచితంగా స్మార్ట్ రేషన్

## కార్డుల పంపిణీ...

- ఆగస్టు 25 నుంచి రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ రేషన్ కార్డుల ఉచిత పంపిణీ
- మొత్తం 1.45 కోట్ల కుటుంబాలకు నాలుగు దశల్లో కార్డుల అందజేత
- గ్రామ, వార్డు సచివాలయాల సహకారంతో రేషన్ షాపుల వద్ద పంపిణీ
- క్యూఆర్ కోడ్, టోల్ ఫ్రీ నంబర్‌తో సరికొత్తగా స్మార్ట్ కార్డులు
- పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాకు టెక్నాలజీతో చెక్: మంత్రి నాదెండ్ల
- కొత్తగా 6.71 లక్షల రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటన



పెన్ పవర్ డెస్క్: ఆంధ్రప్రదేశ్‌లోని రేషన్ కార్డుదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఒక శుభవార్త అందించింది. అత్యాధునిక సాంకేతికతతో కూడిన స్మార్ట్ రేషన్ కార్డులను రాష్ట్రవ్యాప్తంగా ఉచితంగా పంపిణీ చేసేందుకు శ్రీకారం చుట్టింది. ఈ నెల 25వ తేదీ నుంచి నాలుగు దశల్లో ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల

వివరాలు 2లో..

## అవినీతిపై సరికొత్త అస్త్రం..

### జైలు నుంచి ఫైళ్లపై సంతకాలు చేసే రోజులు పోయాయి



- అవినీతిపై కొత్తగా తెచ్చిన మూడు బిల్లులను సమర్థించిన ప్రధాని మోదీ
- తీవ్ర ఆరోపణలతో అరెస్టయితే 30 రోజుల్లో బెయిల్ తప్పనిసరి అని వెల్లడి
- బెయిల్ రాకపోతే 31వ రోజు పీఎం, సీఎం పదవికి రాజీనామా చేయాలి
- జైలు నుంచి ఫైళ్లపై సంతకాలు చేసే రోజులు పోయాయంటూ పరోక్ష విమర్శలు
- కొత్త చట్టాలంటే ప్రతిపక్షాలకు భయం పట్టుకుందని ఎద్దేవా
- కాంగ్రెస్, ఆర్జేడీల అవినీతిపై బీహార్ సభలో తీవ్ర స్థాయిలో ధ్వజం

వివరాలు 2లో..

## కోనసీమలో గోదావరి ఉద్ధృతి..

### అధికారులను అప్రమత్తం చేసిన మంత్రి అచ్చెన్నాయుడు

- కోనసీమలో గోదావరి వరద పరిస్థితిపై మంత్రి అచ్చెన్నాయుడు సమీక్ష
- అధికారులు 24 గంటలూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు
- గోదావరి ఉద్ధృతితో నీట మునిగిన పలు లంక గ్రామాలు
- ప్రాణాలకు తెగించి పడవలపైనే ప్రజల రాకపోకలు
- సహాయక చర్యల్లో జాప్యం వద్దని మంత్రి కీలక సూచనలు



పెన్ పవర్ డెస్క్:గోదావరి నది ఉగ్రరూపం దాల్చడంతో కోనసీమ జిల్లాలో ని లంక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. పెరుగుతున్న వరద ప్రవాహంతో

వివరాలు 2లో..

## వైసీపీ ముసుగు మళ్లీ తొలగింది.. లోనున్న కాషాయ కండువా మరోసారి బయటపడింది

- ఉపరాష్ట్రపతి ఎన్నికలో ఎన్డీయేకు వైసీపీ మద్దతివ్వడంపై షర్మిల విమర్శ
- బీజేపీతో తెర వెనుక అక్రమ పొత్తు కొనసాగిస్తోందని మండిపాటు
- బాబు, జగన్, పవన్ ముగ్గురూ బీజేపీకి తొత్తులేనన్న షర్మిల

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో అధికార వైసీపీ మరోసారి తన బీజేపీ అనుకూల వైఖరిని బయటపెట్టుకుందని, ఆ పార్టీ బీజేపీకి బీ-టీమ్‌గా పనిచేస్తోందన్నది మళ్లీ రుజువైందని ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల విమర్శించారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థికి మద్దతు

వివరాలు 2లో..





## యూరియా బ్లాక్ మార్కెట్ దందా జరుగుతోంది

### ప్రభుత్వంపై కాకాని తీవ్ర ఆరోపణలు

- కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పూర్తిగా విస్మరించిందన్న కాకాని
- రాష్ట్రంలో యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతోంది
- బస్తాకు రూ.200 అదనంగా వసూలు చేస్తున్నారని ఆరోపణ

వివరాలు 2లో..

- చైనాలోని టియాంజిన్‌లో జరగనున్న ఎస్సీఓ శిఖరాగ్ర సదస్సు
- చరిత్రలోనే అతిపెద్ద సమావేశంగా చైనా ప్రకటన
- ఈ నెల 31 నుంచి సెప్టెంబర్ 1 వరకు రెండు రోజుల భేటీ
- హాజరుకానున్న ప్రధాని మోదీ, పుతిన్, జిన్‌పింగ్‌తో పాటు 20 మంది నేతలు
- పాల్గొననున్న ఐరాస సెక్రటరీ జనరల్, ఇతర అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు
- సదస్సు ద్వారా తమ ప్రాబల్యాన్ని చాటుకోవాలని చూస్తున్న చైనా

# చైనాలో చరిత్రలోనే అతిపెద్ద సదస్సు!

## మోదీ సహా హాజరుకానున్న 20 మంది ప్రపంచ నేతలు



పెన్ పవర్ డెస్క్:చైనాలోని టియాంజిన్ నగరం ఒక భారీ అంతర్జాతీయ సదస్సుకు వేదిక కానుంది. షాంఘై సహకార సంస్థ (ఎస్సీఓ) శిఖరాగ్ర సమావేశం ఈ నెల 31, సెప్టెంబర్ 1 తేదీల్లో జరగనుందని, ఇది సంస్థ చరిత్రలోనే అతిపెద్దదిగా నిలవనుందని చైనా శుక్రవారం ప్రకటించింది. ఈ కీలక సమావేశానికి భారత ప్రధాని నరేంద్ర మోదీ సహా సుమారు 20 మంది ప్రపంచ దేశాల అధినేతలు హాజరుకానున్నారు. ఈ వివరాలను చైనా విదేశాంగ శాఖ సహాయ మంత్రి లియు బిన్ మీడియా సమావేశంలో వెల్లడించారు. ఎస్సీఓ కూటమికి ఈ ఏడాది చైనా అధ్యక్షత వహిస్తోందని, ఆతిథ్య దేశంగా నిర్వహిస్తున్న ఐదో సదస్సు ఇదేనని ఆయన తెలిపారు. ఈ సదస్సులో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, భారత ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొంటారని ధృవీకరించారు.

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

### ఈ ఎమ్మెల్యేలను మార్చాల్సిందేనా?

# కొత్తవారు వస్తారా?

కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత ఏడాదిలోనే అనేక వివాదాలు చోటు చేసుకున్నాయి. అయితే ప్రభుత్వ పరంగా కాదు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల కాదు. కేవలం ఎమ్మెల్యేల వల్లనే పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుంది. ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ వరకూ ఎమ్మెల్యేలో చాలా మంది పార్టీ లైన్ దాటి వ్యవహరిస్తున్నారు. లెక్కలేని తనం వారిలో కనిపిస్తుంది. నియోజకవర్గానికి తామే బాస్ లుగా వ్యవహరిస్తున్నారు. తాము ఎన్నికయింది ఎవరి వల్లనన్నది గుర్తించని పరిస్థితుల్లోకి కొందరు ఎమ్మెల్యేలు వచ్చేశారు. అందుకే టీడీపీ నాయకత్వానికి ఈ ఎమ్మెల్యేలతో ఇబ్బందికరంగా మారింది. నిజానికి చెప్పాలంటే చంద్రబాబు నాయుడు గత మూడు దఫాలు ముఖ్యమంత్రిగా చేసినప్పుడు తలెత్తని వివాదాలు ఇప్పుడు కనిపిస్తున్నాయి.

**నాడు ఎమ్మెల్యేలు...**

నాడు ఎమ్మెల్యేలు ఒక పద్ధతిని పాటించేవారు. నియోజకవర్గాల్లో ఎలాంటి అవినీతి పనులకు, అక్రమాలకు వేలు పెట్టేవారు కాదు. అవసరమనుకుంటే స్థానిక నియోజకవర్గ ప్రజలకు సాయం చేసి వారి మన్ననలను పొందేవారు. కాకుంటే బయట ప్రాంతాల్లో వ్యాపారాలు చేసుకోవడంతో పాటు ఏదో ఒక పెద్ద పైరవీని చేసుకుని తాము ఎన్నికల్లో ఖర్చు పెట్టుకున్న మొత్తాన్ని తిరిగి రాబట్టుకునే ప్రయత్నం చేసేవారు. అప్పట్లో ఇవేమీ బయటకు వచ్చేవి కావు. కానీ ఇప్పుడు ఇలా కాదు. నియోజకవర్గాల్లోనే ఎమ్మెల్యేలు దుకాణాలు తెరిచారు. ఇసుక, మద్యం ఏ విషయంలోనూ వేలు పెట్టకుండా ఉండలేకపోతున్నారు. నియోజకవర్గం ప్రజల వద్దనే చేతులు కూడా చాచేవారు కూడా లేకపోలేదు. దీనికి తోడు హంగామా, అనుచరుల ముందు ఎమ్మెల్యే అని చెప్పుకోవడానికి చేస్తున్న వీరంగం చేస్తున్నారు.

**కంట్రోల్ చేయడం ....**

వీరిని కంట్రోల్ చేయడం నాయకత్వానికి కూడా సాధ్యం కాదు. అలవాటు పడిన ప్రాణం ఊరికే ఉండదు. అందుకే ఎమ్మెల్యేలు చేసిన తప్పులను ఒక్కొక్కటిగా నాయకత్వం లెక్క పెట్టుకోవాల్సి వస్తుంది. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేల పనితీరుపై నివేదికలు తెప్పించుకుంటున్నారు. పార్టీ నుంచి సస్పెండ్ చేసుకుంటూ పోతే చాలా మందిని చేయాల్సి వస్తుంది. అందుకే వార్నింగ్ లతో సరిపెడుతున్నారు. అయితే ప్రస్తుతం ఉన్నఎమ్మెల్యేల్లో చాలా మందికి వచ్చే ఎన్నికల్లో టిక్కెట్లు దొరకడం కూడా కష్టమేనని అంటున్నారు. మొన్నటి ఎన్నికల్లోనే చంద్రబాబు సీనియర్ నేతలను నిర్దాక్షిణ్యంగా పక్కన పెట్టారు. ఈసారి ఇప్పుడు వివాదాల్లో చిక్కుకుంటున్న వారికి మాత్రం నో టిక్కెట్ అన్నది పార్టీ వర్గాల నుంచి వినిపిస్తున్న టాక్. కార్యకర్తల అభిప్రాయం కూడా ఇలాగే ఉండటంతో నాలుగేళ్లు వీరు ఏం చేసినా వార్నింగ్ లతో సరిపెట్టాల్సిందే. అంతే తప్ప చర్యలుండవు. అసలు చర్యలు ఎన్నికల్లోనే.

## వైసీపీ ముసుగు మళ్లీ తొలగింది.. లోనున్న కాషాయ కండువా మరోసారి బయటపడింది

- మొదటి పేజి తరువాయి

ప్రకటించడం ద్వారా వైసీపీ అసలు రంగు బయటపడిందని ఆమె ఆరోపించారు. ఈ విషయంపై ఆమె ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "వైసీపీ ముసుగు మళ్ళీ తొలగింది. లోనున్న కాషాయ కండువా మరోసారి బయటపడింది. మోదీకి దత్తపుత్రుడే అని రాష్ట్ర ప్రజలకు కుండబద్దలు కొట్టినట్లు అర్థమైంది" అంటూ ఆమె పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్షం ముసుగులో ఉన్నది కూడా మోడీ పక్షమేనని స్పష్టమైందని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాన పార్టీలన్నీ బీజేపీకి అనుకూలంగానే వ్యవహరిస్తున్నాయని షర్మిల ఆరోపించారు. "బీజేపీ అంటే... బాబు, జగన్, పవన్.. ముగ్గురు మోదీ గారి తొత్తులే. బీజేపీకి ఊడిగం చేసే బానిసలే" అని ఆమె తీవ్రస్థాయిలో విమర్శించారు. టీడీపీ, జనసేన పార్టీలు తెర మీద పొత్తు పెట్టుకుంటే, వైసీపీ మాత్రం బీజేపీతో తెర వెనుక అక్రమ పొత్తు కొనసాగిస్తోందని అన్నారు. వైసీపీ తీరు రాష్ట్రంలో కూటమి పక్షాలతో కుస్తీ, ఢిల్లీలో మతపిచ్చి బీజేపీతో దోస్తీ అన్నట్లుగా ఉందని ఆమె ఎద్దేవా చేశారు. ఎన్డీయే అభ్యర్థికి మద్దతు ఇవ్వడానికి వైసీపీకి సిగ్గుండాలని ఆమె వ్యాఖ్యానించారు.

# యూరియా బ్లాక్ మార్కెట్ దందా జరుగుతోంది

రాష్ట్రంలో యూరియాకు తీవ్ర కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు అమ్ముకుంటున్నారని వైసీపీ నేత, మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. బస్తాకు రూ. 200 వరకు అదనంగా వసూలు చేస్తూ వ్యాపారులు రైతులను దోచుకుంటుంటే ప్రభుత్వం చోద్యం చూస్తోందని ఆయన మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యవసాయ రంగాన్ని పూర్తిగా గాలికి వదిలేసిందని విమర్శించారు.

రైతులు ఎండనకా వాననకా యూరియా కోసం పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఏర్పడిందని కాకాని ఆవేదన వ్యక్తం చేశారు. "బూస్టర్ డోస్ సమయంలో యూరియా అందకపోతే పంటలు పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉంది. కానీ ప్రభుత్వం ముడుపులు తీసుకుని ప్రైవేట్ వ్యక్తులకు యూరియాను కట్టబెట్టింది" అని ఆయన ఆరోపించారు. ఒకసారి ఎరువుల నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, మరోసారి కొరత ఉందని చెబుతూ ప్రభుత్వం పరస్పర విరుద్ధ ప్రకటనలు చేస్తోందని దుయ్యబట్టారు. అసలు ఏ హోల్‌సేల్ వ్యాపారులకు ఎరువులు సరఫరా చేశారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రైతుల వేషాలు వేసి, సెట్టింగులు ఏర్పాటు చేసుకుని మాట్లాడటం తప్ప అన్నదాతలకు చేసిందేమీ లేదని కాకాని విమర్శించారు. "రాష్ట్రంలో ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదు. అతివృష్టి, అనావృష్టితో రైతులు నష్టపోతే కనీసం సమీక్షలు నిర్వహించిన పాపాన పోలేదు. ఇది రైతుల గురించి ఆలోచించని దుర్మార్గమైన ప్రభుత్వం" అని అన్నారు.

గత వైసీపీ

ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకే) ద్వారా రైతులకు అండగా నిలిచామని, ధరల స్థిరీకరణ నిధితో ఆదుకున్నామని గుర్తు చేశారు. కానీ నేటి కూటమి ప్రభుత్వంలో నేతలు దోచుకోవడానికే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇతరుల పథకాలను కాపీ కొట్టడం మినహా చంద్రబాబుకు కొత్తగా ఆలోచించడం తెలియదని కాకాని ఎద్దేవా చేశారు.

# జస్టిస్ సుదర్శన్ రెడ్డి నక్సలిజానికి మద్దతిచ్చారు

ఉపరాష్ట్రపతి ఎన్నికల వేళ రాజకీయాలు వేడెక్కాయి. విపక్ష ఇండియా కూటమి అభ్యర్థి, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డిపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సంచలన ఆరోపణలు చేశారు. సుదర్శన్ రెడ్డి తన తీర్పు ద్వారా నక్సలిజానికి పరోక్షంగా ఊతమిచ్చారని, ఆయన నక్సలిజం మద్దతుదారు అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

శుక్రవారం ఢిల్లీలో జరిగిన మనోరమ న్యూస్ కాన్‌క్లేవ్‌లో అమిత్ షా మాట్లాడుతూ, "జస్టిస్ సుదర్శన్ రెడ్డి నక్సలిజానికి సహకరించిన వ్యక్తి. ఆయన ఇచ్చిన సల్వా జుడుం తీర్పు వల్లే దేశంలో నక్సల్ ఉగ్రవాదం ఏళ్లపాటు కొనసాగింది. ఒకవేళ ఆ తీర్పు రాకపోయి ఉంటే, 2020 నాటికే నక్సలిజాన్ని పూర్తిగా తుడిచిపెట్టేవాళ్లం," అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ వామపక్షాల ఒత్తిడికి తలొగ్గి ఇలాంటి వ్యక్తిని అభ్యర్థిగా నిలబెట్టిందని, సుప్రీంకోర్టు వంటి పవిత్రమైన వేదికను దుర్వినియోగం చేసిందని ఆయన విమర్శించారు.

**ఏమిటీ సల్వా జుడుం తీర్పు?**

ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులను ఎదుర్కోవడానికి 2005లో అప్పటి ప్రభుత్వం గిరిజన యువతతో 'సల్వా జుడుం' పేరుతో ఒక పౌర సైన్యాన్ని ఏర్పాటు చేసింది. వీరికి ఆయుధ శిక్షణ ఇచ్చి స్పెషల్ పోలీస్ ఆఫీసర్లుగా నియమించింది. అయితే, ఈ దళంపై మానవ హక్కుల ఉల్లంఘన ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై దాఖలైన పిటిషన్‌ను విచారించిన జస్టిస్ సుదర్శన్ రెడ్డి నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం 2011లో చరిత్రాత్మక తీర్పు వెలువరించింది. పౌరులకు ఆయుధాలిచ్చి ప్రభుత్వమే హింసను ప్రోత్సహించడం రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేస్తూ సల్వా జుడుంను రద్దు చేసింది. కాగా, అధికార ఎన్డీఏ కూటమి తమ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను బరిలోకి దింపిన విషయం తెలిసిందే. ఆయన తమిళనాడుకు చెందిన సీనియర్ బీజేపీ నేత.

## ఏపీలో ఉచితంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ...

- మొదటి పేజి తరువాయి

శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. శుక్రవారం విజయవాడ సమీపంలోని కానూరు సివిల్ సప్లైస్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆశయాలకు అనుగుణంగా, ప్రభుత్వ సేవల్లో పారదర్శకతను పెంచి, చివరి వ్యక్తి వరకు ప్రయోజనాలు అందాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని 1 కోటి 45 లక్షల కుటుంబాలకు ఈ స్మార్ట్ కార్డులను అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్డుల పంపిణీ ప్రక్రియను ఆయా రేషన్ దుకాణాల వద్ద గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది సహకారంతో పండుగ వాతావరణంలో నిర్వహిస్తామని అన్నారు.

స్మార్ట్ కార్డు ప్రత్యేకతలు ఇవే

ఈ కొత్త స్మార్ట్ కార్డులు కేవలం గుర్తింపు పత్రాలుగా కాకుండా, అనేక భద్రతా ఫీచర్లతో వస్తున్నాయని నాదెండ్ల మనోహర్ వివరించారు. ప్రతి కార్డుపై ప్రభుత్వ అధికారిక చిహ్నంతో పాటు, కుటుంబ సభ్యుల వివరాలు స్పష్టంగా ఉంటాయి. మోసాలకు తావులేకుండా భద్రత కోసం ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేశారు. అలాగే, వినియోగదారులు తమ సమస్యలు, ఫిర్యాదులను నేరుగా తెలియజేసేందుకు వీలుగా టోల్ ఫ్రీ నంబర్ 1967ను కూడా కార్డుపై ముద్రించారు. ఈ సాంకేతికత వినియోగం ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యం అక్రమ రవాణాను సమర్థవంతంగా అరికట్టవచ్చని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దేశంలోనే ఇంత భారీ స్థాయిలో టెక్నాలజీతో కూడిన కార్డులు పంపిణీ చేయడం బహుశా ఇదే తొలిసారి కావచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.

**నాలుగు విడతల్లో పంపిణీ ఇలా...**

కార్డుల పంపిణీని ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేసేందుకు ప్రభుత్వం పక్కా ప్రణాళికను సిద్ధం చేసింది. నాలుగు విడతల్లో జిల్లాల వారీగా పంపిణీ షెడ్యూల్‌ను మంత్రి ప్రకటించారు.

మొదటి విడత (ఆగస్టు 25): విజయనగరం, విశాఖపట్నం, ఎన్టీఆర్, తిరుపతి, నెల్లూరు, శ్రీకాకుళం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల్లో పంపిణీ ప్రారంభమవుతుంది.

రెండో విడత (ఆగస్టు 30): చిత్తూరు, కాకినాడ, గుంటూరు, ఏలూరు జిల్లాల్లో జరుగుతుంది.

మూడో విడత (సెప్టెంబర్ 6): అనంతపురం, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, అనకాపల్లి జిల్లాల్లో చేపడతారు.

నాలుగో విడత (సెప్టెంబర్ 15): బాపట్ల, పల్నాడు, వైఎస్సార్ కడప, అన్నమయ్య, శ్రీ సత్యసాయి, కర్నూలు, నంద్యాల, ప్రకాశం జిల్లాల్లో కార్డుల అందజేత పూర్తవుతుంది.

# గాజాలో తీవ్ర కరవు నెలకొంది

## అధికారికంగా ప్రకటించిన ఐక్యరాజ్యసమితి

గాజా నగరంలో తీవ్ర కరవు స్థితి నెలకొందని ఐక్యరాజ్యసమితి (ఐరాస) శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. మధ్యప్రాచ్య చరిత్రలో ఒక ప్రాంతంలో కరువును ప్రకటించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. అయితే, ఈ నివేదికను ఇజ్రాయెల్ తీవ్రంగా ఖండించింది. ఇదంతా హమాస్ ప్రచారం చేస్తున్న అబద్ధమని కొట్టిపారేసింది. దీంతో గాజాలో వాస్తవ పరిస్థితులపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి.

ఇంటిగ్రేటెడ్ ఫుడ్ సెక్యూరిటీ ఫేజ్ క్లాసిఫికేషన్ (ఐపీసీ) అందించిన నివేదిక ఆధారంగా ఐరాస ఈ ప్రకటన చేసింది. గాజా నగరంతో సహా దాదాపు 20 శాతం ప్రాంతంలో కరవు పరిస్థితులు ఉన్నాయని నివేదిక స్పష్టం చేసింది. వెంటనే కాల్పుల విరమణ జరిగి, మానవతా సాయం అందకపోతే ఖాన్ యూనిస్, దీర్ అల్-బలా వంటి దక్షిణ ప్రాంతాలకు కూడా ఈ సంక్షోభం విస్తరించే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరించారు. జెనీవాలో జరిగిన సమావేశంలో ఐరాస సహాయ ప్రధాన అధికారి టామ్ ఫ్లెచర్ మాట్లాడుతూ, ఇది పూర్తిగా నివారించదగిన కరవు అని అన్నారు. ఇజ్రాయెల్ క్రమపద్ధతిలో అడ్డంకులు సృష్టించడం వల్లే సరిహద్దుల్లో ఆహార సరఫరా నిలిచిపోయిందని ఆయన ఆరోపించారు. "ఇది మనందరినీ వెంటాడే కరవు" అని ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధంలో ఆకలిని ఒక ఆయుధంగా ఉపయోగించడం యుద్ధ నేరమని ఐరాస మానవ హక్కుల అధికారి వోల్కర్ టర్క్ పేర్కొన్నారు.

మరోవైపు, ఐరాస నివేదికను ఇజ్రాయెల్ విదేశాంగ శాఖ తీవ్రంగా ఖండించింది. ఇది పూర్తిగా తప్పుడు, పక్షపాత నివేదిక అని పేర్కొంది. "గాజాలో కరవు లేదు. ఈ నివేదిక హమాస్ చెబుతున్న అబద్ధాలపై ఆధారపడి ఉంది" అని ఆరోపించింది. గాజాకు సహాయ సరఫరాను పెంచేందుకు తాము అన్ని చర్యలూ తీసుకుంటున్నామని ఇజ్రాయెల్ సైనిక సంస్థ 'కోగాట్' తెలిపింది.

**కరవు నిర్ధారణ ఇలా...!**

ఒక ప్రాంతంలో కరవును ప్రకటించాలంటే ఐపీసీ కొన్ని కఠినమైన నిబంధనలను పాటిస్తుంది. జనాభాలో కనీసం 20 శాతం కుటుంబాలు తీవ్ర ఆహార కొరతను ఎదుర్కోవడం, 30 శాతం చిన్నారులు తీవ్ర పోషకాహార లోపంతో బాధపడటం, ప్రతి 10,000 మందిలో ఇద్దరు పెద్దలు లేదా నలుగురు చిన్నారులు ఆకలితో మరణించడం వంటివి ఈ నిబంధనలలో ముఖ్యమైనవి. గాజాలో ఈ పరిస్థితులు ఉన్నాయని ఐపీసీ నిర్ధారించింది. అయితే, ఘర్షణల కారణంగా మరణాల సంఖ్యను కచ్చితంగా ధృవీకరించడం కష్టంగా ఉందని నిపుణులు చెబుతున్నారు. గతంలో సోమాలియా, దక్షిణ సూడాన్ వంటి దేశాల్లో కరవును ప్రకటించినా, మధ్యప్రాచ్యంలో ప్రకటించడం ఇదే తొలిసారి. 2023 అక్టోబర్ 7న హమాస్ దాడి తర్వాత మొదలైన ఈ ఘర్షణల్లో ఇప్పటివరకు 60,000 మందికి పైగా పాలస్తీనియన్లు మరణించినట్లు గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది.

## చైనాలో చరిత్రలోనే అతిపెద్ద సదస్సు!

- మొదటి పేజి తరువాయి

వీరితో పాటు టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్, ఇండోనేషియా అధ్యక్షుడు ప్రభోవో సుబియాంటో, మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం, వియత్నాం ప్రధాని ఫామ్ మిన్ చిన్ వంటి ప్రముఖ నేతలు కూడా ఈ భేటీలో పాల్గొంటారని లియు బిన్ వివరించారు. దక్షిణాసియా నుంచి పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలీ, మాల్దీవుల అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జు కూడా హాజరవుతున్నట్లు తెలిపారు. అంతేకాకుండా, ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్‌తో పాటు 10 అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు కూడా ఈ సదస్సుకు రానున్నారు. ప్రస్తుతం ఎస్సీఓ కూటమిలో రష్యా, భారత్, ఇరాన్, కజకిస్థాన్, కిర్గిజ్‌స్థాన్, పాకిస్థాన్, తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్, బెలారస్, చైనా సభ్యదేశాలుగా ఉన్నాయి.

# చైనాలో కుప్పకూలిన రైల్వే బ్రిడ్జి... 12 మంది మృతి

చైనాలో నిర్మిస్తున్న ఓ భారీ రైల్వే వంతెన నిర్మాణంలో ఉండగానే కుప్పకూలింది. యెల్లో రివర్‌పై శుక్రవారం జరిగిన ఈ ఘోర దుర్ఘటనలో 12 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోగా, మరో నలుగురి ఆచూకీ గల్లంతైంది. సిచువాన్-కింగ్‌హై రైల్వే ప్రాజెక్టులో భాగంగా ఈ వంతెనను నిర్మిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో సైట్‌లో ప్రాజెక్ట్ మేనేజర్‌తో సహా మొత్తం 16 మంది ఉన్నట్లు 'పీపుల్స్ డైలీ' వెల్లడించింది. స్టీల్ కేబుల్ తెగిపోవడమే ఈ దుర్ఘటనకు కారణమని ప్రభుత్వ వార్తా సంస్థ జిన్హువా తెలిపింది. ఈ ఘటనలో పది మంది అక్కడికక్కడే మరణించగా, తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. చైనాలో రెండో అతిపెద్ద నది అయిన యెల్లో రివర్‌పై నిర్మిస్తున్న తొలి రైల్వే స్టీల్ ట్రస్ ఆర్చ్ బ్రిడ్జి ఇదే కావడం గమనార్హం. అంతేకాదు, ప్రపంచంలోనే అతిపెద్ద స్పాన్ డబుల్-ట్రాక్ స్టీల్ ట్రస్ ఆర్చ్ బ్రిడ్జిగానూ ఇది గుర్తింపు పొందింది. వంతెనకు చెందిన ప్రధాన ఆర్చ్ భాగం ఒక్కసారిగా నదిలో కూలిపోయిన దృశ్యాలను చైనా సెంట్రల్ టెలివిజన్ (సీసీటీవీ) ప్రసారం చేసింది. సమాచారం అందుకున్న వెంటనే వందలాది మంది సహాయక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. చైనాలో భద్రతా ప్రమాణాల అమలు బలహీనంగా ఉండటంతో ఇలాంటి నిర్మాణ ప్రమాదాలు తరచూ జరుగుతుంటాయని విమర్శలు ఉన్నాయి. గతేడాది డిసెంబర్‌లో కూడా షెన్‌జెన్ నగరంలో ఓ రైల్వే నిర్మాణ ప్రదేశం కూలి 13 మంది కార్మికులు గల్లంతైన విషయం తెలిసిందే.

## దేశానికే ఆదర్శంగా ఏపీ 'నైపుణ్యం పోర్టల్'

- మొదటి పేజి తరువాయి

నెలలో ఈ పోర్టల్‌ను ప్రారంభించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని లోకేశ్ సూచించారు. ఈ సందర్భంగా అధికారులు పోర్టల్ పనితీరు, దాని లక్ష్యాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం మంత్రి పోర్టల్ డెమోను పరిశీలించారు. దేశంలో మరెక్కడా ఇలాంటి సమగ్రమైన పోర్టల్ లేదని ఆయన ప్రశంసించారు. ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ స్కీమ్‌తో 'నైపుణ్యం పోర్టల్'ను అనుసంధానించాలని ఆయన అధికారులకు సూచనలు చేశారు.

ఈ పోర్టల్ ద్వారా రాష్ట్రంలోని నైపుణ్య కేంద్రాలు, న్యాక్, సీడాప్‌లను ఒకే వేదికపైకి తీసుకువస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీని ద్వారా ఏటా సుమారు 50 వేల మంది యువతకు వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చేందుకు వీలు కలుగుతుందని వివరించారు. ఇప్పటికే 36 రంగాలకు సంబంధించి 3 వేలకు పైగా జాబ్ కేటగిరీలను పోర్టల్‌లో నమోదు చేసినట్లు వారు పేర్కొన్నారు. ఇదే సమావేశంలో మంత్రి నారా లోకేశ్ మరో ముఖ్యమైన నిర్ణయం తీసుకున్నారు. దృష్టి లోపం ఉన్న విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ వంటి సైన్స్ గ్రూపుల్లో చేరేందుకు అనుమతి మంజూరు చేశారు. వారికి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించి, వారి చదువుకు అండగా నిలవాలని అధికారులను ఆదేశించారు.

# అవినీతిపై సరికొత్త అస్త్రం..

అవినీతిపై తమ ప్రభుత్వం మరింత కఠినంగా వ్యవహరించబోతోందని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. తీవ్రమైన అవినీతి ఆరోపణలతో అరెస్టయిన ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, మంత్రులు 30 రోజుల్లోగా బెయిల్ పొందలేకపోతే, 31వ రోజున తమ పదవులకు రాజీనామా చేయాల్సిందేనని ఆయన అన్నారు. ఇందుకు సంబంధించిన మూడు కొత్త బిల్లులను ఆయన గట్టిగా సమర్థించారు. శుక్రవారం బీహార్‌లోని గయలో జరిగిన ఓ బహిరంగ సభలో ప్రధాని మోదీ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.

ఈ కొత్త చట్టాలను చూసి ప్రతిపక్షాలు ఎందుకు భయపడుతున్నాయో ప్రజలందరికీ తెలుసని మోదీ చురకలంటించారు. ఎన్డీయే ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ అవినీతి నిరోధక బిల్లుల పరిధిలోకి దేశ ప్రధాని కూడా వస్తారని ఆయన గుర్తుచేశారు. "ఈ చట్టం అమల్లోకి వస్తే, ఏ ముఖ్యమంత్రి, మంత్రి లేదా ప్రధానమంత్రి అయినా అరెస్ట్ అయిన 30 రోజుల్లోగా బెయిల్ తెచ్చుకోవాలి. లేదంటే వారు తమ పదవిని వదులుకోవాల్సి ఉంటుంది" అని ప్రధాని వివరించారు.

ప్రస్తుత చట్టాల ప్రకారం, ఒక చిన్న ప్రభుత్వ ఉద్యోగి 50 గంటల పాటు అదుపులో ఉంటే సస్పెండ్ అవుతాడని, కానీ ముఖ్యమంత్రులు, మంత్రులు మాత్రం జైల్లో ఉంటూ కూడా అధికార ప్రయోజనాలను అనుభవిస్తున్నారని మోదీ అన్నారు. ఇటీవల కాలంలో జైలు నుంచే ఫైళ్లపై సంతకాలు చేయడం, ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయడం చూశామని, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను ఉద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యానించారు. నాయకుల తీరు ఇలా ఉంటే అవినీతిపై పోరాటం ఎలా సాధ్యమవుతుందని ఆయన ప్రశ్నించారు.

స్వాతంత్ర్యం తర్వాత 60-65 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో అవినీతి కేసులు లెక్కలేనన్ని ఉన్నాయని, కానీ తమ ప్రభుత్వానికి ఒక్క అవినీతి మరక కూడా అంటలేదని మోదీ అన్నారు. బీహార్‌లోని ఆర్జేడీ అవినీతి గురించి

ప్రతి చిన్న పిల్లాడికి కూడా తెలుసని ఎద్దేవా చేశారు. అవినీతిపై పోరాటాన్ని చివరి వరకు తీసుకెళ్లాలంటే ఎవరినీ వదిలిపెట్టకూడదనేది తన గట్టి నమ్మకమని చెప్పారు. కాంగ్రెస్, ఆర్జేడీ ప్రభుత్వాలు ప్రజాధనం విలువను ఎన్నడూ గుర్తించలేదని, తమ ఖజానాలు నింపుకోవడానికే దాన్ని ఉపయోగించాయని ఆరోపించారు. అందుకే వారి హయాంలో ప్రాజెక్టులు ఏళ్ల తరబడి అసంపూర్తిగా ఉండేవని, ప్రాజెక్టు ఆలస్యమయ్యే కొద్దీ దాని నుంచి డబ్బులు దండుకునేవారని ప్రధాని మోదీ తీవ్రంగా విమర్శించారు.

## కోనసీమలో గోదావరి ఉద్ధృతి..

- మొదటి పేజి తరువాయి

ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జిల్లాలో వరద పరిస్థితిపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలతో టెలిఫోన్‌లో మాట్లాడిన ఆయన, క్షేత్రస్థాయి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వరద ముప్పు పొంచి ఉన్న గ్రామాల్లో యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. సహాయక చర్యల్లో ఎలాంటి జాప్యం జరగకూడదని, అవసరమైతే ప్రజలను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. ప్రజల భద్రతే ప్రథమ కర్తవ్యంగా భావించి, 24 గంటలూ అందుబాటులో ఉంటూ పరిస్థితిని పర్యవేక్షించాలని అధికారులకు మంత్రి సూచించారు. ప్రభుత్వం కూడా ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తోందని ఆయన భరోసా ఇచ్చారు.

మరోవైపు, క్షేత్రస్థాయిలో పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. గోదావరి పరీవాహక ప్రాంతాలు వరద నీటితో నిండిపోవడంతో అనేక లంక గ్రామాలు బాహ్య ప్రపంచంతో సంబంధాలు కోల్పోయాయి. అయినవిల్లి మండలంలోని ముక్తేశ్వరం కాజ్‌వే వంటివి నీట మునగడంతో, స్థానిక ప్రజలు ప్రయాణాల కోసం పూర్తిగా పడవలపైనే ఆధారపడుతున్నారు. అయితే, అత్యంత ప్రమాదకరంగా ఎలాంటి లైఫ్ జాకెట్లు ధరించకుండానే ప్రయాణిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. లైఫ్ జాకెట్లు లేకుండా ప్రయాణికులను ఎక్కించుకోవద్దని జిల్లా కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా, వాటిని అమలు చేయడంలో స్థానిక అధికారులు శ్రద్ధ తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

# రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయి



వైయస్సార్ కడప,పెన్ పవర్ ఆగస్టు22: జిల్లాలో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయనీ,రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదనీ జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోని పి జి ఆర్ ఎస్ హాల్లో యూరియా లభ్యతపై జాయింట్ కలెక్టర్ అదితీ సింగ్ తో కలిసి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ.. రైతులకు ఎరువులు అవసరమైన మేర స్టోరేజీ అందుబాటులో ఉందన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డిమాండ్ ఆధారంగా ఎరువులు ఆర్ఎస్కేల ద్వారా అందజేస్తామని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు ఆర్ఎస్కేలలో 3700 టన్నుల ఎరువులు అందుబాటు లో ఉన్నాయని రైతులు వినియోగించు కోవాలన్నారు.ప్రవేట్ ఎరువుల డీలర్స్ నిబంధనల ప్రకారం మాత్రమే ఎరువులను విక్రయించాలని ఆదేశించారు. బల్క్‌స్టాక్ పెట్టుకుని కృత్రిమ కొరత సృష్టిస్తే వారిపై కఠిన చర్యలు చేపడతామన్నారు. డీలర్స్ రైతుల డిమాండ్ ను ఆసరాగా చేసుకుని అనవసరమైన వేరే ఉత్పత్తులను, పోషకాలను లింక్ చేసి అమ్మితే వారిపై కఠిన చర్యలు తీసుకొని,వారి లైసెన్సును రద్దు చేస్తామని హెచ్చరించారు.

# పెన్ పవర్
## వై.ఎస్.ఆర్. కడప
## అన్నమయ్య జిల్లా




# బ్రహ్మోత్సవాల్లో భక్తులకు వసతి, ఇతర సౌకర్యాలపై టీటీడీ ఈవో సమీక్ష

**తిరుమల పెన్ పవర్ ఆగస్ట్ 22 :** బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు వసతి, ఇతర సౌకర్యాలకు సంబంధించి ఇబ్బందులు తలెత్తకుండా తిరుమలలోని అన్ని గదులలో ఎలక్ట్రిక్ పనులు, మరుగుదొడ్లు, ఇతర రిపేర్లను సకాలంలో పూర్తి చేయాలని టీటీడీ ఈవో జె.శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుమలలోని అన్నమయ్య భవన్ లో శుక్రవారం ఉదయం అధికారులతో బ్రహ్మోత్సవాల్లో భక్తుల వసతి, ఇతర సౌకర్యాలపై ఈవో సమీక్షించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ తిరుమలలోని పలు విశ్రాంతి గృహాలు, కాటేజీల మరమ్మతు పనులను రిసెప్షన్ విభాగంతో సమన్వయం చేసుకుని సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. యాత్రికుల వసతి సముదాయాల్లో కూడా సెంట్రలైజ్డ్ బుకింగ్ సిస్టమ్ అప్లికేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రస్తుతం మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రంలో భక్తులు వేచి ఉండే సమయం ఎక్కువగా ఉన్నందున వేరొక ప్రాంతంలో కూడా అన్న ప్రసాద భవనం ఏర్పాటు చేసేందుకు పరిశీలించాలని ఆదేశించారు. రాష్ట్ర ఆహార భద్రతా అధికారులతో తిరుమలలో ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, హోటళ్లలో ఆహార నాణ్యతను పరిశీలించాలన్నారు. అదేవిధంగా పంచాయతీ, రెవెన్యూ విభాగం ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, హోటళ్ల లో ఏర్పాటు చేసిన ధరల పట్టికను పరిశీలించాలని ఆదేశించారు. తిరుమలలోని హోటళ్లలో భక్తులకు సాంప్రదాయ భోజనం అందించేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. భక్తులు లడ్డూ ప్రసాదం తీసుకోవడంలో ఇబ్బంది తలెత్తకుండా లడ్డూ ప్రసాద విక్రయ కేంద్రంలోని అన్ని కౌంటర్లు పని చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతానెలా నిర్వహించే ఫీడ్ బ్యాక్ సర్వే ద్వారా వచ్చే భక్తుల అభిప్రాయాలను, సలహాలు, సూచనలను తీసుకుని ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, సీఈ సత్య నారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# శ్రీ కపిలేశ్వరాలయంలో ఘనంగా లక్ష కుంకుమార్చన






తిరుపతి పెన్ పవర్ ఆగస్టు 22 : తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామివారి ఆలయంలో శుక్రవారం శ్రీ కామాక్షి అమ్మవారికి శాస్త్రోక్తంగా లక్ష కుంకుమార్చన నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయంలోని మండపంలో శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, శ్రీ సరస్వతి అమ్మవారు, శ్రీ కామాక్షి అమ్మవార్లను కొలువుదీర్చి కుంకుమార్చన నిర్వహించారు. ముందుగా కలశస్థాపన, గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశారాధన చేశారు. ఈ సందర్భంగా కుంకుమతో అమ్మవారికి అర్చన చేశారు.

ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో సుబ్బా రాజు, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఇతర అధికారులు, అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# యూరియా కొరత సృష్టిస్తే చర్యలు : కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి





**వైయస్సార్ కడప పెన్ పవర్ ఆగస్టు 22 :** జిల్లాలో కృత్రిమ యూరియా కొరతను సృష్టిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ప్రవేట్ ఫర్టిలైజర్స్ డీలర్స్‌ను హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్లోని బోర్డు హాల్లో వ్యవసాయ అధికారులు, విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు, ప్రవేట్ ఫర్టిలైజర్స్ డీలర్స్ లతో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ తో కలిసి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రవేట్ ఫర్టిలైజర్స్ వ్యాపారులు కృత్రిమ యూరియా కొరత సృష్టిస్తే చర్యలు కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. జిల్లాలోని దాదాపు 430 ప్రైవేట్ ఫర్టిలైజర్స్ షాపుల వద్ద యూరియా ఎరువుల ఎమ్మార్పీ రేట్ల తో కూడిన బ్యానర్లను ఏర్పాటు చేయాలన్నారు.రైతులు ఎరువుల కోసం ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుందని, జిల్లావ్యాప్తంగా యూరియా ఎరువులు పూర్తిస్థాయి లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లాలో 3700 యూరియా అందుబాటులో ఉందని గతంతో పోలిస్తే 20% అధిక నిలువలు ఉన్నాయని తెలిపారు. వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్‌మార్కెట్‌లో విక్రయిస్తే వారి లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. వ్యాపారులు ఎం ఆర్ పి ధరలకు మాత్రమే విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రేపటినుండి విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారుల ద్వారా తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ప్రవేట్ ఫర్టిలైజర్స్ వ్యాపారులు యూరియాతోపాటు నానో కాంప్లెక్స్ ఎరువులు వంటి వాటిని జత చేసి విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామన్నారు. రైతులకు సరిపోయే యూరియా ఎరువులు అందుబాటులో ఉన్నాయని రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. అక్రమంగా యూరియాను వినియోగిస్తున్నా, అధిక ధరలకు విక్రయిస్తున్నా, సంబంధిత సమాచారం కోసం జిల్లా వ్యవసాయ శాఖ వారు ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెంబర్లకు ఫోన్ చేయవచ్చన్నారు.

**కంట్రోల్ రూమ్ నెంబర్లు : 8331057300, 9491940106, 8919081933**

ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ జీడీ చంద్ర నాయక్,జమ్మలమడుగు ఆర్డీఓ సాయి శ్రీ, విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి శ్రీనివాసరావు కంట్రోల్ రూమ్ అధికారులు, ప్రవేట్ ఫర్టిలైజర్స్ డీలర్లు,తదితర అధికారులు పాల్గొన్నారు.

# కృష్ణా జలాలతో సస్యశ్యామల రాయలసీమ కల నిజం

## రైతుల కష్టాలకు తెరదించే ప్రాజెక్ట్ - సత్యకుమార్ యాదవ్



**ధర్మవరం, పెన్ పవర్ ఆగస్టు 22 :** రాయలసీమ రైతుల కలలు సాకారం కాబోతున్న చారిత్రాత్మక ఘట్టంగా నిలిచే రోజు ఇది అని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ధర్మవరం నియోజకవర్గ పరిధిలోని HNSS (హంద్రీ-నీవా సుజల స్రవంతి) ప్రాజెక్ట్ ఫేజ్-II ప్రధాన కాలువ వద్ద నీటి విడుదల సందర్భంగా నిర్వహించిన జలహారతి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, జలహారతి సమర్పించి, రాయలసీమ రైతుల శ్రేయస్సు, ప్రజల అభివృద్ధి కోసం ప్రార్థించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కృష్ణా నది వరదనీటిని వినియోగించి సాగునీరు, తాగునీటి అవసరాలను తీర్చడంలో HNSS ప్రాజెక్ట్ చారిత్రాత్మక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. రాయలసీమలోని ఏడు జిల్లాలకు నంద్యాల, కర్నూలు, అనంతపురం, శ్రీ సత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి సుమారు 6.025 లక్షల ఎకరాల సాగునీటితో పాటు 33 లక్షల మందికి తాగునీరు అందించడం ద్వారా ఈ ప్రాజెక్ట్ ప్రాంతీయ అభివృద్ధికి పెద్ద తోడ్పాటు అందిస్తోందని తెలిపారు., ఈ ప్రాజెక్ట్ ద్వారా కృష్ణా నది వరద నీటిని ఆగస్టు నుండి నవంబరు వరకు 120 రోజుల పాటు వినియోగిస్తూ, సుమారు 40 టీఎంసీల నీటిని సేకరించి సరఫరా చేస్తున్నామని తెలిపారు. మొత్తం HNSS ప్రధాన కాలువ పొడవు 554 కిలోమీటర్లు ఉండగా, ఫేజ్-I కర్నూలు జిల్లా నుండి జీడిపల్లి రిజర్వాయర్ (అనంతపురం) వరకు 216.300 కిలోమీటర్లు విస్తరించి ఉందని, ఫేజ్-II జీడిపల్లి రిజర్వాయర్ నుండి అదివిపల్లి రిజర్వాయర్ (అన్నమయ్య జిల్లా) వరకు 337.70 కిలోమీటర్లు కొనసాగుతోందని వివరించారు. ప్రధాన కాలువ ద్వారా నీటిని పంపిణీ చేయడానికి ఫేజ్-Iలో 9 లిఫ్ట్ స్టేజీలు, ఫేజ్-IIలో 5 లిఫ్ట్ స్టేజీలు ఏర్పాటు చేయబడ్డాయని, మొత్తం 433.481 మీటర్ల ఎత్తు వరకు నీటిని లిఫ్ట్ చేసి సరఫరా చేస్తున్నామని చెప్పారు. ధర్మవరం నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న పనులపై మాట్లాడుతూ, HNSS ప్రధాన కాలువ ఫేజ్-II ధర్మవరం నియోజకవర్గంలో 386.000 కిలోమీటరు వద్ద (కోడిపల్లి గ్రామం, కనగానపల్లి మండలం) నుండి ప్రవేశించి 400.500 కిలోమీటరు వరకు, అంటే మొత్తం 14.80 కిలోమీటర్ల పొడవున విస్తరించి ఉందని తెలిపారు. ఈ ప్రాంతంలో కాలువ లైనింగ్ పనులను మేసర్స్ BSR ఇన్ఫ్రాటెక్ ఇండియా లిమిటెడ్ సంస్థకు అప్పగించామని, ఇప్పటికే 80% పనులు పూర్తయ్యాయని, అయితే ప్రస్తుతం నీటి విడుదల కారణంగా లైనింగ్ పనులు తాత్కాలికంగా





నిలిపివేశామని వివరించారు. అదే విధంగా, ముదిగుబ్బ గ్రామం సమీపంలో నిర్మాణంలో ఉన్న జిల్లేడు బండ రిజర్వాయర్ ప్రాధాన్యతను మంత్రి గారు ప్రస్తావిస్తూ, దీని సామర్థ్యం 2.418 టీఎంసీలు అని తెలిపారు. ఈ రిజర్వాయర్ ద్వారా ముదిగుబ్బ, బత్తలపల్లి, తాడిమర్రి, ధర్మవరం మండలాల్లోని 23,000 ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు, ఈ మండలాలకు చెందిన గ్రామాలకు తాగునీరు మరియు పరిశ్రమల అవసరాల కోసం 0.338 టీఎంసీల నీరు కూడా సరఫరా చేయనున్నామని తెలిపారు. రిజర్వాయర్ నిర్మాణానికి రూ. 680 కోట్ల అంచనా వ్యయం ఉండగా, ఇప్పటి వరకు రూ.165 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. నీటి విడుదలపై మాట్లాడుతూ, మంత్రి సత్యకుమార్ యాదవ్, 17-08-2025న మధ్యాహ్నం 3 గంటలకు HNSS ఫేజ్-II ప్రధాన కాలువ నుండి నీటిని విడుదల చేసి, గొల్లపల్లి, మరాల, చెర్లపల్లి రిజర్వాయర్లను నింపుతున్నామని తెలిపారు. అలాగే 19-08-2025న మడకశిర బ్రాంచ్ కాలువ ద్వారా గొల్లపల్లి రిజర్వాయర్లో నీటిని చేరవేశామని, చెర్లపల్లి రిజర్వాయర్ నుండి పుంగనూరు బ్రాంచ్ కాలువకు 17-08-2025న నీటిని విడుదల చేయగా, అన్నమయ్య జిల్లాలో 19-08-2025న నీరు చేరిందని వివరించారు. ప్రాజెక్ట్ పరిధిలోని మధ్యవర్తి చెరువులు (MI ట్యాంకులు) కూడా ఈ నీటితో నింపబడుతున్నాయని తెలిపారు. రాయలసీమ భవిష్యత్తుపై ఆశాభావం వ్యక్తం చేస్తూ, మంత్రి సత్యకుమార్ యాదవ్, HNSS ప్రాజెక్ట్ ద్వారా రాయలసీమలో శాశ్వత నీటి కొరత సమస్యకు ముగింపు పలకనున్నామని, రైతుల సాగు కలలు నిజమవుతాయని, వ్యవసాయం, పరిశ్రమలు, పట్టణాలు, గ్రామాలు అన్నీ తాగునీరు మరియు సాగునీరు సమృద్ధిగా పొందుతాయని పేర్కొన్నారు. ఇది రాయలసీమ ప్రజలకు ఒక చారిత్రాత్మకమైన రోజు అని, ఈ ప్రాజెక్ట్ ప్రాంతానికి గొప్ప ఆశీర్వాదం అవుతుందని అన్నారు. చీఫ్ ఇంజనీర్ నాగరాజు, సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజస్వరూప్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మురళి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ షబానా జైనాబ్, కాంట్రాక్ట్ ఏజెన్సీ: BSR ఇన్ఫ్రాటెక్ ఇండియా లిమిటెడ్ బెంగళూరు, ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరం

### చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు

### ఆడ శిశువును కాపాడుదాం ... సృష్టిని రక్షిద్దాం

### డిఎల్ఎస్ఏ కార్యదర్శి, చిత్తూరు, మరియు సీనియర్ సివిల్ జడ్జి భారతి




**చిత్తూరు, పెన్ పవర్ ఆగస్టు 22 :** జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షలు చేయకుండా ఆపాలి. లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరం. చేసిన వారు, చేయించుకున్న వారు, ప్రోత్సహించిన వారు చట్ట ప్రకారం శిక్షార్హులు అని చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం స్థానిక జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరం నందు చిత్తూరు డివిజనల్ అధికారి అధ్యక్షతన లింగ వివక్షత నిర్మూలన పై అవగాహన కార్యక్రమము, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టం 1994 రూల్స్ 1996 పై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్తూరు ఆర్డీవో మాట్లాడుతూ జిల్లాలో ఆడపిల్లల నిష్పత్తిని మెరుగుపరచడానికి పిసిపిఎన్డిటి చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఇందుకు సంబంధించి అన్ని శాఖల వారు సహాయ సహకారాలను అందించాలని తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్ లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. లింగ నిర్ధారణ నిషేధ చట్టం, భేటీ బచావో బేటి పడావో, సేవ్ ద గర్ల్ చైల్డ్ మొదలగు6 కార్యక్రమాలపై వైద్యాధికారులు తోపాటు 'స్వచ్ఛంద సంస్థలు' కూడా అవగాహనకార్యక్రమాలను ఎక్కువగా నిర్వహించాలని కోరారు. లింగ నిర్ధారణ చేసే ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లను కనిపెట్టేందుకు చేపట్టే డెకాయ్ ఆపరేషన్లు నిర్వహణకు పోలీస్ శాఖ, స్వచ్ఛంద సంస్థల సహాయ సహకారాలు అందించాల న్నారు. డి ఎల్ ఎస్ ఏ జడ్జి భారతి మాట్లాడుతూ... దేశంలో రోజు రోజుకు పెరిగిపోతున్న భ్రూణహత్యలు, పౌష్టికాహార లోపాలు, అనారోగ్యం, అవిద్య, బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా వంటి బాలికల సమస్యలపై మరింతచిత్తశుద్ధితో పాటుపడాలి. లింగదుర్విచక్షణను రూపుమాపాలి.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో బాలికలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించాలి. విద్యతో పాటు క్రీడలు, కళలు, సాంకేతిక రంగాల్లో రాణించినప్పుడే సమగ్రఅభివృద్ధి సాధ్యమ వుతుంది. ఇందుకోసం





ప్రభుత్వాలతో పాటు సామాజిక కార్యకర్తలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చొరవ తీసుకుంటేనే బంగారుతల్లికి భరోసా దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ అధికారి మూర్తి, ICDS మిషన్ కోఆర్డినేటర్ నిర్మల, డిసిపిఓ సుబ్రహ్మణ్యం, డివిజన్ పరిధిలోని CDPO, ICDS సూపర్వైజర్స్, పంచాయతీ సెక్రెటరీ, గ్రామ వార్డు సచివాలయాల అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్స్ సంబంధిత శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## స్వమిత్వ సర్వే కార్యక్రమాన్ని

# వేగవంతం చేయాలి

### జిల్లా జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్



**పాణ్యం, పెన్ పవర్ ఆగస్టు 22 :** జిల్లాలో జరుగుతున్న స్వమిత్వ సర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ సి విష్ణు చరణ్ పాణ్యం మండలం, భూపనపాడు గ్రామంలో జరుగుతున్న స్వమిత్వ సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం స్వమిత్వ సర్వే కార్యక్రమంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ఈ సర్వే కార్యక్రమాన్ని సంబంధిత అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి ఈనెల 31వ తేదీ లోపల పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా సచివాలయంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయతీ సెక్రటరీలు బృందాలుగా ఏర్పడి సర్వే చేపట్టడం జరుగుతుందన్నారు. మన జిల్లాలో ఆగస్టు 1వ తేదీ నుంచి సర్వే జరుగుతోందని నంద్యాల జిల్లాలో 188 గ్రామాలలో స్వమిత్వ సర్వే చేపట్టడం జరుగుతుందన్నారు. ఇంకా సర్వే టీమ్స్ పెంచి ఆగస్టు 31వ తేదీ లోపల సర్వే పూర్తి చేయాలన్నారు. స్వమిత్వ సర్వే వల్ల ఎటువంటి ఎన్ క్రోచ్ మెంట్ సమస్యలు ఉండవని, ఎవరి ఆస్తి వారికే చెల్లెందుకు ఈ సర్వే ఉపయోగపడుతుందన్నారు. సర్వే పూర్తి అయిన తర్వాత ప్రతి ఒక్కరికి ప్రాపర్టీ సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ స్వమిత్వ సర్వే కార్యక్రమం పూర్తయ్యేందుకు సహకరించాలన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సర్వే మ్యాప్ ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి లలితా బాయి, ఎంపీడీవో, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయతీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.



ఇండియన్ ఎక్స్ ప్రెస్ గ్రూప్ కు చెందిన ఎక్స్ ప్రెస్ ఇన్ ఫ్రా ఎండీ కవిత సింఘానియా శుక్రవారం శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.50 లక్షలు విరాళం అందించారు.

## తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి పవిత్రోత్సవాలు

**తిరుపతి పెన్ పవర్ ఆగస్టు 22 :** తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో సెప్టెంబరు 3 నుండి 5వ తేదీ వరకు జరుగనున్న పవిత్రోత్సవాలకు సెప్టెంబరు 2వ తేదీ సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం ఆచార్య రుత్విక్వరణంలో భాగంగా ఋత్వికులకు విధులు కేటాయించి వస్త్రసమర్పణ చేస్తారు. సాయంత్రం ఆలయ విమాన ప్రాకారం చుట్టూ సేనాధిపతివారిని ఊరేగింపు నిర్వహించి, ఆ తరువాత యాగశాలలో అంకురార్పణ కార్యక్రమాలు చేపట్టనున్నారు. పవిత్రోత్సవాల్లో భాగంగా సెప్టెంబరు 3న ఉదయం పవిత్ర ప్రతిష్ఠ, సాయంత్రం యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. సెప్టెంబరు 4న మూలవర్లకు, ఉత్సవర్లకు, విమాన ప్రాకారానికి, ధ్వజస్తంభానికి, మాడ వీధుల్లోని శ్రీమఠం ఆంజనేయస్వామి వారికి పవిత్రాలు సమర్పిస్తారు. సెప్టెంబరు 5న పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగుస్తాయి. ఈ మూడు రోజుల పాటు ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గోవిందరాజస్వామివారి ఉత్సవర్లకు స్నపనతిరుమంజనం నిర్వహిస్తారు.

## విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ సపోర్టెడ్ బై... టాటా ట్రస్టు..




తిరుపతి పెన్ పవర్ ఆగస్టు 22 : CMAM ప్రోగ్రామ్ భాగంలో మాల్ న్యూట్రిషన్ కు గురివుతున్న మాత శిశువులు వారి సంరక్షణ గురించి వైద్యధికారులకు. ఆరోగ్య కార్యకర్తలకు మరియు ఆశ కార్యాకర్తలు లకు శిక్షిణా కార్యక్రమం జిల్లా వైద్య మరియు ఆరోగ్య శేఖ అధికారి Dr బాలకృష్ణ నాయక్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి లో ఏర్పాటు చేయడం జరిగింది.... ఈ కార్యక్రమంకు జిల్లా ఇమ్యూనిజషన్ ఆఫీసర్ Dr శాంతకుమారి.. డిప్యూటీ DMHOలు Dr శ్రీనివాసులరెడ్డి..Dr శైలజా....Dr మృదలవాణి... Dr హారిక మరియు టాటా ట్రస్టు నుండి రాష్ట్రీయ ప్రోగ్రాం మేనేజర్ KS సుబ్రహ్మణ్యం టాటా ట్రస్టు సిబ్బంది పాల్గొన్నారు.. తిరుపతి dmho మీటింగ్ హాల్ నందు జరిగింది.

## నారావారిపల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్...





**తిరుపతి పెన్ పవర్ ఆగస్టు 22 :** నారావారిపల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో "డిజిటల్ నర్స్ సెంటర్ను" (DiNC)ఏర్పాటు చేయటం కొరకు సౌకర్యం,మౌలిక సదుపాయాల గురించి తెలుసుకొనుటకు శ్రీమతి సరస్వతీ, Ex-IRS, (Head Grouth& impact)TATA బృందము ఈరోజు నారావారిపల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను సందర్శించారు. వీరితోపాటు డాక్టర్ వి బాలకృష్ణ నాయక్, జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి, డాక్టర్ ఆనంద మూర్తి డిసిహెచ్ఎస్, డాక్టర్ శ్రీనివాసరావ్ డిపిఎమ్ఓ పాల్గొన్నారు. అనంతరం ఈ బృందము గౌరవ కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ శ్రీ వేంకటేశ్వర్ని కలిసి డిజిటల్ సర్వేసెంటర్ ఏర్పాటు గురించి చర్చించి అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాల గురించి తెలియజేశారు. ఈ డిజిటల్ సర్వీస్ సెంటర్ ను ఏర్పాటు చేయటం వలన ఆ ప్రాంతంలోని ప్రజలందరికి నిరంతర ఆరోగ్య పర్యవేక్షణ ద్వారా రోగ నిర్ధారణ, వైద్య నిపుణులతో అపాయింట్మెంట్లు, వ్యక్తిగత కౌన్సిలింగ్లు ఇతర ఆరోగ్య సేవలను అందించడం ద్వారా మాతృ మరణాలను, శిశు మరణాలను పూర్తిస్థాయిలో నివారించుటకు కృషి చేయడం జరుగుతుందని తెలియజేశారు.

## యూరియా పంపిణీ చేసిన కలెక్టర్



**కడప పెన్ పవర్ ఆగస్టు 22 :** ప్రభుత్వం సరఫరా చేస్తున్న యూరియా ఎరువుల పంపిణీ ఎలా జరుగుతోందని, వ్యవసాయ అధికారులు, రైతులతో ఆరా తీసిన జిల్లా కలెక్టర్. జిల్లాలో యూరియా కు ఎలాంటి కొరత లేదని, ప్రభుత్వం సరఫరా చేసే యూరియాను 50% రైతు సేవా కేంద్రాల ద్వారా, 50% డీలర్ల ద్వారా పంపిణీ చేయడం జరుగుతోందని తెలిపిన జిల్లా కలెక్టర్. ఖరీఫ్ సీజన్ లో విడతల వారీగా.. రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారమే సరఫరా చేయడం జరుగుతోందని, ఒక్కో ఎకరాకు ఒక్కో బస్తా లెక్కన పంపిణీ చేస్తున్నట్లు, రైతులందరికీ కవర్ అయ్యేలా పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపిన జిల్లా కలెక్టర్. పోరుమామిళ్ళ, బద్వేలు ప్రాంతాల్లోని ప్రధాన ఎం.ఐ. ట్యాంకులను పూర్తిగా నింపి ఆయకట్టు భూములకు సాగునీరు అందిస్తున్నామని, డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ నిర్మాణాలు చేపట్టాల్సిన అవసరం ఉందని, కాలువల మరమ్మతులు కూడా చేపట్టాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ కు వివరించిన ఇరిగేషన్ అధికారులు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట పాల్గొన్న.. బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్, జిల్లా వ్యవసాయ అధికారి చంద్రా నాయక్, మండల తహసీల్దార్ కార్తీక్, సంబంధిత వ్యవసాయ, రెవెన్యూ, అధికారులు తదితరులు.

# ఆదర్శ హై స్కూల్లో స్కాలర్షిప్ టెస్ట్

## 120 మంది విద్యార్థులు టెస్ట్కి హాజరు









**గంగవరం, పెన్ పవర్ ,ఆగస్టు 22 :** తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం కొత్తపల్లి ఆదర్శ హై స్కూల్ లో శుక్రవారం జెసిఐ ఆధ్వర్యంలో హైస్కూల్ విద్యార్థులకు స్కాలర్షిప్ టెస్ట్ నిర్వహిం చారు. జెసిఐ జోనల్ ప్రెసిడెంట్ ఆదర్శ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ డైరెక్టర్ జె ఎఫ్ ఎస్ సంతోష్ కుమార్, జే సి ఐ ఫస్ట్ లేడీ ఆదర్శ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్ జాయింట్ సెక్రెటరీ జెఎఫ్టి ప్రవల్లిక ,జెసిఐ కాకినాడ ఆదర్శ డైమండ్స్ ప్రెసిడెంట్ వినిల్ ఆధ్వర్యంలో స్కాలర్షిప్ టెస్ట్ నిర్వహించారు. గత నెలలో నిర్వహించిన రిజిస్ట్రేషన్లో 120 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ తీసుకొనుగా వారికి శుక్రవారం మ్యాథ్స్ సైన్స్ జనరల్ నాలెడ్జి సంబంధించిన ప్రశ్నల తో టెస్ట్ నిర్వహించడం జరిగిందని ప్రధానోపాధ్యాయుడు సత్యనారా యణ తెలిపారు. టెస్ట్కు హాజరైన విద్యార్థులందరికీ ఆదర్శ కాలేజీ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపల్ డాక్టర్ త్రినాధరావు, కోఆర్డినేటర్ శ్రీనివాస్ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ స్కాలర్షిప్ టెస్ట్ను విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకురాలు ప్రసన్నను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలకు కలెక్టర్కు ఆహ్వానం



**చిత్తూరు, పెన్ పవర్ ఆగస్టు 22 :** ఆగస్టు 27 నుండి సెప్టెంబర్ 16 వరకు నిర్వహించనున్న కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ను ఆలయ ఈఓ పెంచల కిషోర్ ఆహ్వాన పత్రిక అందించి సాదరంగా ఆహ్వానించారు. శుక్రవారం జిల్లా సచివాలయంలోని కలెక్టర్ ఛాంబర్ నందు జిల్లా కలెక్టర్ ను కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ఈఓ కలిశారు. ఈ సందర్భంగా వేద పండితులు వేద ఆశీర్వచనం పలుకగా ఆలయ ఈఓ బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రికను, స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ ఆగస్టు 27 నుండి సెప్టెంబర్ 16 వరకు నిర్వహించనున్న కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలకు జిల్లా కలెక్టర్ ను అధికారికంగా ఆహ్వానించడం జరిగిందని తెలిపారు. స్వామి వారి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించుటకు జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని చేపట్టిన ఏర్పాట్ల పై జిల్లా కలెక్టర్ కు వివరణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. బ్రహ్మోత్సవాలకు తరలి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా స్వామి వారిని దర్శించుకునేలా అన్ని చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు.

## రిజర్వాయర్ను పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యేలు





**కడప పెన్ పవర్ ఆగస్టు 22 :** శుక్రవారం వైఎస్ఆర్ జిల్లా, బ్రహ్మంగారి మఠం మండల పరిధిలోని బ్రహ్మంసాగర్ రిజర్వాయర్ను మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్తో కలిసి పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి. ముందుగా బ్రహ్మం సాగర్ పరిధిలోని ఆయాకట్టు ప్రాంతాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలనే ఉద్దేశ్యంతో.. రిజర్వాయర్ లో నీటిమట్టం, స్టోరేజీ కెపాసిటీ, కుడి ఎడమ కాలువల స్థితిగతులపై ఇరిగేషన్ అధికారులతో మాట్లాడిన జిల్లా కలెక్టర్. అనంతరం కుడి, ఎడమ కాలువల్లో నీటి ప్రవాహం, కాలువల మరమ్మతులు, ఆయకట్టుకు అవసరమైన నీటి లభ్యత.. మొదలైన వివరాలను చర్చించిన జిల్లా కలెక్టర్. రిజర్వాయర్ లో నీటి ప్రస్తుత మట్టం, ఇన్ ఫ్లో వివరాలను, రిజర్వాయర్, పిల్ల కాలువల మ్యాప్ ను పరిశీలించి.. స్టోరేజీ సామర్థ్యం పెంపొందించేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఇరిగేషన్ అధికారులతో మాట్లాడిన జిల్లా కలెక్టర్. పోరుమామిళ్ళ, బద్వేలు ప్రాంతాల్లోని ప్రధాన ఎం.ఐ. ట్యాంకులను పూర్తిగా నింపి ఆయకట్టు భూములకు సాగునీరు అందిస్తున్నామని, డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ నిర్మాణాలు చేపట్టాల్సిన అవసరం ఉందని, కాలువల మరమ్మతులు కూడా చేపట్టాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ కు వివరించిన ఇరిగేషన్ అధికారులు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట పాల్గొన్న.. బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్, ఇరిగేషన్ ఏస్.ఈ. వెంకటరామయ్య, బద్వేలు డివిజన్ ఈఈ మధుసూదన్ రెడ్డి, డీలు, ఏఈ లు, బి.మఠం మండల తహసీల్దార్ కార్తీక్, సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు తదితరులు.

# విద్యార్థులకు ఉచితంగా నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని తిరుపతిలో ప్రారంభించడం హర్షణీయం






**తిరుపతి, పెన్ పవర్ ఆగస్టు 22 :** బి.ఎస్.సి, జిఎన్ఎం కోర్సులు చేసిన పేద విద్యార్థుల కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా జర్మని లో ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, వెనుకబడిన ఓ బి.సి పేద విద్యార్థులకు కూడా జర్మన్ బాషా శిక్షణ అందిస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రివర్యులు డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక బాబు జగజ్జీవన్ భవన్ నందు ఎస్సీ, ఎస్టీ నర్సింగ్ విద్యార్థులకు జర్మన్ భాష ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ బి. లావణ్య వేణి, సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంఎం నాయక్, జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్, నైపున్యాభివృద్ది శాఖ ఈ.డి మధుసూదన్, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్లతో కలసి అంబేద్కర్ మరియు బాబు జగ్జీవన్ చిత్రపటాలకు పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలన చేసి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రివర్యులు డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ప్రారంభించారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రివర్యులు మాట్లాడుతూ ... ఎస్సీ, ఎస్టీ నర్సులకు జర్మన్ భాషా శిక్షణ మరియు నియామక కార్యక్రమం మొదటగా మూడు ప్రదేశాలలో గుంటూరు, విశాఖపట్నం తిరుపతి లలో మొదలు పెడదామని అనుకున్నామని, తర్వాత దానిని 5 ప్రదేశాలలో పెంచాలని ఆలోచనతో తర్వాత కర్నూలు కాకినాడ లలోని మెడికల్ కాలేజీలలో ఏర్పాటు చేశామని ఉన్నారు. జర్మన్ భాష పై శిక్షణ ఇచ్చే ఏజెన్సీ వారు ముందుకు వస్తే 26 జిల్లాలకు కూడా విస్తరింప చేయాలనే ఆలోచనలో ఉన్నామని అన్నారు. జర్మనీ భాష పై నర్సింగ్ విద్యార్థులు పట్టు పెంచుకోవాలని, తెలుగు భాష వలె జర్మనీ భాషని కూడా రాస్తూ అనుక్షణం చదువుతూ దానిపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. మీరందరూ ఆర్థిక అభివృద్ధి సాధించాలంటే మీ కుటుంబాన్ని అభివృద్ధిలోకి తీసుకురావాలంటే ఆదాయ వనరులు పుష్కలంగా ఉండే జర్మనీ లాంటి దేశాలకు వెళ్లి డబ్బును సంపాదించి మీ కుటుంబ అభివృద్ధికి తోడ్పాటునందించాలని అన్నారు. మీరందరూ సమయం వృధా చేయకుండా భవిష్యత్తుపై దృష్టి పెట్టాలని అందుకు అహర్నిశలు శ్రమించాలని తెలిపారు. ప్రభుత్వం కూడా సహాయ సహకారాలు అందిస్తోందని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ రోజు న ప్రభుత్వం చదువుకునే పిల్లలకు ఎక్సలెన్స్ పేరున 10 సెంటర్లను పెట్టి ఐఐటి నీట్ లాంటి పరీక్షలకు కోచింగ్ ఉచితంగా అందిస్తోందని అన్నారు. నీట్ పరీక్ష తప్పిన విద్యార్థులకు లాంగ్ టర్మ్ కోచింగ్ ను అందించేందుకు ఎస్సీలు 60 మందికి ఎస్టీలు 20 మందికి కలిపి మొత్తం 80 మందికి కోచింగ్ ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్క కుటుంబం కూడా ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో పి- 4 ను ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టారని అన్నారు. స్కిల్ డెవలప్మెంట్ ను మంత్రి నారా లోకేష్, మరియు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కేంద్రం తరఫున ప్రధాని ప్రోత్సహిస్తూ సహకారం అందిస్తున్నారని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన బియ్యం అందిస్తున్నామని, మధ్యాహ్న భోజనంలో కూడా నాణ్యమైన బియ్యం అందిస్తున్నామని తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసి వివిధ పనులు చేసుకుంటున్న వారికి కూడా జర్మనీ భాష నేర్పించి జర్మనీ వెళ్లి ఉద్యోగం చేసుకునేలా ఉపాధి అవకాశాలు కల్పిస్తామని అన్నారు. ప్రతి పేద బడుగు వర్గాల వారి ఇళ్లలో వెలుగు చూసేలా విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందించే ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా ముఖ్యమంత్రి గారి ఆలోచన దృష్ట్యా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలకు చెందినటువంటి విద్యార్థులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం ఎస్సీ, ఎస్టీ నర్సులకు జర్మన్ భాషా శిక్షణ మరియు నియామక కార్యక్రమం ఒక వినూత్నమైనటువంటి కార్యక్రమము అని మన రాష్ట్రంలో జాబ్ మేళాలు ద్వారా కొంతమందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని, ప్రభుత్వ ఉద్యోగాలను కూడా గౌ. ముఖ్యమంత్రివర్యులు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నారని ఆ మేరకు ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆయన చేసిన మొదటి సంతకం డీఎస్సీ నియామకం అని అన్నారు. డి ఎస్ సి రాత పరీక్ష ఇటీవలే పూర్తయినదని, నియామకాలు కూడా చేపడుతున్నారని అన్నారు. త్వరలో అలాట్మెంట్ కూడా జరుగుతుందని తెలిపారు. మన దగ్గర ఉన్న ప్రభుత్వ,ప్రైవేటు ఉద్యోగాలే కాకుండా మరొక అడుగు ముందుకు వేసి ఈరోజు వెల్ఫేర్ మరియు స్కిల్ డెవలప్మెంట్ శాఖలు కలిసి మన ఎస్సీ ఎస్టీ పిల్లలని ఇంకా ఉన్నతమైన స్థానాలకు తీసుకెళ్లాలనే ముఖ్య ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని మొదలుపెట్టడం జరిగింది అని అన్నారు. ఈ కార్యక్రమాన్ని రెండు ప్రదేశాలైన విజయవాడ, గుంటూరులలో విజయవంతంగా నడుపుతున్నారని అన్నారు. తిరుపతిలో కూడా సుమారుగా రాయలసీమ జిల్లాలలో ఉన్నటువంటి బిఎస్సి నర్సింగ్ జిఎన్ఎమ్ కోర్సులు చేసినటువంటి విద్యార్థులకు ప్రభుత్వం జర్మన్



భాషలో ఉచితంగా శిక్షణ ఇప్పించి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నదని తెలిపారు. కావున ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఏదైతే ఏ1, ఏ2, బి1, బి2 పరీక్షలు అన్నీ కూడా జాగ్రత్తగా రాసుకున్నట్లయితే వీసా తో పాటు ఉపాధి అవకాశం కూడా కల్పించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు. ప్రభుత్వ సహాయ సహకారాలు లేకుండా ఉద్యోగ అవకాశం పొందాలంటే ఎగ్జామ్ ఫీజు, వీసా ఖర్చులు అన్నీ కలుపుకొని సుమారు 13 లక్షల దాకా ఖర్చు అవుతుందని, సాధా రణంగా శిక్షణ ఇవ్వడానికి ప్రైవేట్ సంస్థలు 75 వేల దాకా చార్జ్ చేస్తారని ఆ బాధ్యత అంతా కూడా ప్రభుత్వం తీసుకుని బీఎస్సీ నర్సింగ్, జిఎన్ ఎమ్ పూర్తి చేసిన 52 మందిని అప్రూవల్ చేసిందని వారందరూ కూడా చక్కగా శిక్షణ పొంది జర్మనీలో ఉద్యోగ అవకాశం పొందేలా చర్యలు తీసుకుంటున్నదని అన్నారు. భారతదేశ జనాభా లో 25 నుండి 35 సంవత్సరాల వయసు ఉన్నవారు చాలా ఎక్కువగా ఉన్నారని వెస్టర్న్ దేశాలతో పోలిస్తే అక్కడ వయసు పైబడిన వారు ఎక్కువ మంది ఉన్నారని కాబట్టి ఇతర దేశాలలో ఉపాధి అవకాశాలు చాలా ఎక్కువగా ఉండడంతో వాటిని అందిపుచ్చుకోవడం కోసం మన రాష్ట్రం నర్సింగ్ లో మాత్రమే కాకుండా వివిధ విభాగాలలో యువతకు శిక్షణ అందిస్తూ విదేశాలలో ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రోత్సహిస్తుందని అన్నారు. మన దేశంతో పోలిస్తే ఇతర దేశాలలో ఆదాయ వనరులు ఎక్కువ కనుక తలసరి ఆదాయం పెరిగే అవకాశం ఉన్నదని అన్నారు. కావున ప్రతి ఒక్కరు భయపడకుండా దృఢ నిశ్చయంతో స్కిల్స్ పెంపొందించుకునీ ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. తిరుపతి ఎం.ఎల్ ఏ మాట్లాడుతూ .. రాష్ట్ర ప్రభుత్వం మన గౌరవ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ గారు యువ నాయకులు మంత్రివర్యులు మన నారా లోకేష్ గారు ముగ్గురు కూడా కలిసి రాష్ట్రాన్ని ముందుకు తీసుకు రావడానికి ఆహర్నిశలు కష్టపడుతూ అందులో భాగంగానే ఈరోజు నైపున్యాభివృద్ధి శాఖ, సాంఘిక సంక్షేమం మరియు సామాజిక సంక్షేమం శాఖల సమన్వయంతో ఎస్సీ ఎస్టీ నర్సింగ్ విద్యార్థులకు జర్మన్ భాష ట్రైనింగ్ శిక్షణ కార్యక్రమాన్ని మన మంత్రివర్యులు తిరుపతిలో ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఇది తిరుపతిలోనే కాదు తిరుపతి తో పాటు గుంటూరు అదే విధంగా విశాఖపట్నం మన రాష్ట్రంలో మూడు చోట్ల కూడా ఈ నైపుణ్యాలు భాషా శిక్షణ కేంద్రాలు కూడా ప్రారంభించడం జరిగిందని తెలిపారు. మీ తల్లిదండ్రులకు మీరు ఉపయోగపడే విధంగా గౌరవ ముఖ్యమంత్రి గారు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎం ఎం నాయక్ మాట్లాడుతూ కొత్త భాష నేర్చుకోవడం వల్ల జ్ఞాపకశక్తి ఆత్మస్థైర్యం మెంటల్ ఎబిలిటీ పరిజ్ఞానం పెంపొందించుకోవడంతోపాటు తెలివితేటలు అభివృద్ధి చెంది అలాగే జర్మన్ లో నర్సింగ్ కొత్త విధానంలో ముందుకెళ్తూ అవకాశాలు అంది పుచ్చుకోవడానికి మన ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ విద్యార్థులకు సువర్ణ అవకాశంగా తెలియజేశారు. సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్ బి. లావణ్య వేణి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము ప్రత్యేక చొరవ తీసుకొని నర్సింగ్ పూర్తి చేసినటువంటి మహిళలు కు, జర్మన్ లో ఉపాధి అవకాశాలను పెంపొందించుకొని వారి జీవన విధానంలో ఆర్థికంగా, సాంఘికంగా, సృజనాత్మకత, పెంపొందించుకుని ,ఎదగడానికి ఈ కార్యక్రమం మంచిగా దోహదపడుతుందని తెలియజేశారు. ఏపీ ఎస్ ఎస్ డి సి ఎండి తరపున ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రం నలువైపుల నుండి నర్సింగ్ చేసిన విద్యార్థులకు జర్మన్ భాష పై ఆరు నెలలు శిక్షణ ఇచ్చి మరియు వారికి జర్మన్ దేశంలో ఉద్యోగ కోసం కల్పించడానికి రాష్ట్రం నందు పలుచోట్ల శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసి వారికి జర్మన్ భాష పై పట్టు సాధించడానికి ఉచితంగా శిక్షణ ఇచ్చి %ూ1, ూ2, దీ1, దీ%2 లెవెల్ లో అర్హత సాధించడానికి అన్ని విధాల సహాయ సహకారాలను అందిస్తామని తెలిపారు. అనంతరం గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహాన్ని, బి.ఎస్.సి నర్సింగ్, జి.ఎన్.ఎం విద్యార్థుల వసతి గృహాన్ని సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ బి. లావణ్య వేణి, సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంఎం నాయక్, జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్, నైపున్యాభివృద్ది శాఖ ఈ.డి మధుసూదన్, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్లతో కలసి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రివర్యులు డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సాంఘీక సంక్షేమ శాఖ డైరెక్టర్ లు కుమారి , బాబు , సోషల్ వెల్ఫేర్ డి.డి శ్రీ .విక్రమ్ కుమార్ రెడ్డి, డి టి డబ్ల్యూఓ, ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ శ్రీ.రాజ సోము, టు కమ్స్ ఇన్స్టిట్యూట్ శ్రీమతి. చంద్రిక, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆర్. లోకనాథం, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ సిబ్బంది, నాయకులు ప్రజాప్రతినిధులు, మరియు ఏపీ ఎస్ఎస్డిసి సిబ్బంది వారు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలపై ప్రజలకు

# అవగాహన కల్పించండి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా




**నంద్యాల, పెన్ పవర్ ఆగస్టు, 22 :** గణేష్ ఉత్సవాలను పటిష్టంగా నిర్వహించడంతో పాటు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలను జరగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులు, గణేష్ కమిటీ సభ్యులను జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో గణపతి ఉత్సవాల ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణాతో కలిసి సంబంధిత అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులతో జిల్లా కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... గణేష్ ఉత్సవాల్లో భాగంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు సమన్వయం చేసుకుంటూ విజయవంతంగా నిర్వహించాలి. నంద్యాల చిన్నచెరువులో నిమజ్జన కార్యక్రమం నిర్వహించనున్నందున అక్కడ 5 నిమజ్జన పాయింట్స్ ఏర్పాటు చేయడంతో పాటు బండ్ పటిష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిమజ్జన సమయంలో ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని మత్స్య శాఖ అధికారిని, విగ్రహాలు ఏర్పాటు చేసే చోట సరిపడా లైటింగ్ ఉండేలా చూడాలని విద్యుత్ శాఖ వారిని, రహదారుల్లో పాట్ హోల్స్ లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్ అండ్ బీ అధికారులను, నిమజ్జన పరిసర ప్రాంతాల్లో శానిటేషన్ పకడ్బందీగా నిర్వహించాలని మున్సిపల్ కమీషనర్ ను కలెక్టర్ ఆదేశించారు. నిమజ్జన ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని జిల్లా వైద్యాధికారులను, అదే విధంగా నిమజ్జన సమయంలో ఆర్టీసీ బస్సులను నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ వారిని, ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అధిక వర్షాల కారణంగా నీటి ప్రవాహం అధికంగా ఉన్నందున నీటి ప్రవాహాన్ని దృష్టిలో ఉంచుకొని అందుకు తగు చర్యలు తీసుకోవాలని కెసి కెనాల్ అధికారులకు కలెక్టర్ సూచించారు. ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా మాట్లాడుతూ....గణేష్ ఉత్సవ నిర్వాహకులు విగ్రహాల ఏర్పాటుకు గాను గణేష్ ఉత్సవ్.నెట్ లో నమోదు చేసుకోవడం ద్వారా సింగిల్ విండో అనుమతులు ఇవ్వడం జరుగుతోందన్నారు. పెద్ద డిజెల ద్వారా ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. జెసిబి, క్రేన్స్ సరిపడా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయకుణ్ణి పూజిద్దాం-పర్యావరణాన్ని రక్షిద్దాం అనే జ్యూట్ బ్యాగ్స్ ను జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ రాము నాయక్, నంద్యాల ఏఎస్పీ మంద జావలి ఆల్ఫోన్స్, నంద్యాల ఆర్డీఓ విశ్వనాథ్, ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతి, జిల్లా అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల స్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు...





**తిరుమల పెన్ పవర్ ఆగస్టు 22 :** సెప్టెంబర్ 24 నుండి అక్టోబర్ రెండవ తేదీ వరకు తిరుమల సాలకట్ల బ్రహ్మోత్సవాలు జరగనున్న సందర్భంగా భక్తులు అనేక సుదూర ప్రాంతాల నుండి వచ్చే అవకాశం ఎక్కువ ఉంది కాబట్టి భక్తులకు ఎలాంటి ప్రయాణంలో అసౌకర్యం కలగకుండా అధిక చార్జీలు వసూలు చేయకుండా చార్జీల నియంత్రణకు రవాణా శాఖ అధికారులు పోలీస్ శాఖ వారితో మరియు తిరుమల తిరుపతి దేవస్థానం విజిలెన్స్ విభాగం వారితో స్థానిక జిల్లా రవాణా శాఖ అధికారి కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా తిరుపతి ట్రాఫిక్ డిఎస్పీ రామకృష్ణా చారి మాట్లాడుతూ ప్రాథమికంగా యాత్రికులకి మీరే మార్గ నిర్దేశకులు గా ఉండాలని యాత్రికుల పట్ల సద్భావన కలిగి ఉండాలని తెలియజేశారు. తిరుమల ట్రాఫిక్ సిఐ హరి ప్రసాద్ మాట్లాడుతూ తిరుమలలో నిర్దేశించిన పార్కింగ్ స్థలాల్లో మాత్రమే వాహనాలు నిలపాలని లేదంటే వారిపై కఠినచర్యలు తీసుకోవాల్సి వస్తుందని తెలియజేశారు. తిరుపతి ట్రాఫిక్ సిఐ భాస్కర్ నాయక్ మాట్లాడుతూ అధిక ట్రాఫిక్ రద్దీ కారణంగా ట్రాఫిక్ నియమ నిబంధనలు మరియు వన్ వే రహదారి నిబంధన అతిక్రమణ చేయకుండా వాహనదారులంతా క్రమశిక్షణతో మెలగాలని తెలియజేశారు. అలిపిరి AVSO రమేష్ మాట్లాడుతూ తిరుమల వెళ్లే అన్ని వాహనాలకి విధిగా ఫాస్ట్ ట్యాగ్ ఉండాలని ఆగస్టు 15 నుండి ఈ నిబంధనను తిరుమల తిరుపతి దేవస్థాన ఈవో మరియు అడిషనల్ ఈవో గారు అమలు చేయమని నిర్దేశించడంతో వాహనదారులు అందరు కూడా గమనించి ఫాస్ట్ ట్రాక్ నిబంధనను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ మాట్లాడుతూ ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుమలకు వచ్చే భక్తుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని తెలియజేశారు. స్థానిక మోటార్ వాహనాలు తనిఖీ అధికారులు వనం వెంకట సుబ్రహ్మణ్యం మరియు శ్రీనివాసరావు సమావేశంలో పాల్గొన్న మోటార్ క్యాబ్ మరియు మ్యాక్సీ క్యాబ్ వాహన యాజమాన్య సంఘ ప్రతినిధులతో ధరల నియంత్రణ గురించి ప్రాథమిక ప్రాతిపదిక నివేదిక తయారు చేశారు. జాతీయ రహదారిలో టోల్ గేట్లు మరియు దేవస్థాన పార్కింగ్ రుసుములపై వాహన యాజమాన్యం నిర్దేశించిన వాహన చార్జీలకు అదనంగా రుసుము పెంచాలని అభ్యర్థించారు. తదుపరి సమావేశంలో వాహన చార్జీలు నిర్ణయిస్తామని అధికారులు తెలియజేశారు. ఈ సమావేశంలో తిరుపతి మరియు తిరుమల మోటర్ క్యాబ్ మరియు మ్యాక్సీ క్యాబ్ సంఘ ప్రతినిధులు, స్థానిక మోటర్ వాహనాలు తనిఖీ అధికారులు అతికా నాజ్, శ్రీకాళహస్తి మోటారు వాహన తనిఖీ అధికారి దామోదర్ నాయుడు, జిల్లా ఎన్ఫోర్స్మెంట్ వాహన తనిఖీ అధికారులు మోహన్ కుమార్, రమణ నాయక్, ఆంజనేయ ప్రసాద్ పాల్గొన్నారు.

# క్యాన్సర్ నియంత్రణపై వైద్య అధికారులకు ఎన్‌సిడి 4.0 స్క్రీనింగ్ శిక్షణ




**తిరుపతి, పెన్ పవర్ ఆగస్టు 22 :** క్యాన్సర్ నియంత్రణపై జిల్లా లోని వైద్య అధికారులకు NCD 4.0 క్యాన్సర్ స్క్రీనింగ్ శిక్షణ కార్యకమము జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి, డాక్టర్ వి. బాలకృష్ణ నాయక్ ఆధ్వర్యంలో తిరుపతి, శ్రీ వెంకటేశ్వర మెడికల్ కాలేజ్‌లో మరియు శ్రీకాళహస్తి ఏరియా హాస్పిటల్ నందు ఈరోజు రీ–ఓరియంటేషన్ ట్రైనింగ్ ప్రోగ్రాం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి SVMC ప్రిన్సిపాల్ డా. జి. రవి ప్రభు, DMHO డా. బాలకృష్ణ నాయిక్, SVRRGGH సూపరింటెండెంట్ డా.రాధా, GMH సూపరింటెండెంట్ డా. జి.ప్రమీలాదేవి గారు మరియు కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డా. సునిత శ్రీగిరి పాల్గొన్నారు. “కార్యక్రమంలో భాగంగా ఎస్.వి.ఎం.సీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రవి ప్రభు గారు మాట్లాడుతూ”?క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించి నివారించడం వలన జీవనకాలం పెరిగి జీవన నాణ్యత మెరుగవుతుంది. క్యాన్సర్ స్క్రీనింగ్ ఒక ఐచ్చికం కాదు, ఇది ప్రతి వ్యక్తి బాధ్యత. శిక్షణలో భాగంగా CHC నుండి నిపుణులైన స్పెషలిస్టు వైద్యులు Gynaecologist s, Dental surgeons పాల్గొని, డెడికేటెడ్ ప్రివెంటివ్ ఆంకాలజీ యూనిట్ సభ్యుల పర్యవేక్షణలో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా క్యాన్సర్ స్క్రీనింగ్, NCD 4.0 ప్రోటోకాల్ అమలు, వైద్య అధికారుల భూమిక వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ శిక్షణ ద్వారా వైద్య అధికారులలో ప్రజారోగ్య అవగాహన పెంపు మరియు సమర్థవంతమైన సేవలందించడంలో మరింత బలోపేతం అవుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ప్రివెంటివ్ ఆంకాలజీ యూనిట్ ఆధ్వర్యంలో, నోడల్ అధికారులు డా. టి. శివకళ, Dr.Guru vijay మరియు జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డా. పి. రెడ్డి ప్రసాద్, dr. జితేంద్ర గార్ల సమన్వయంతో, ప్రివెంటివ్ ఆంకాలజీ యూనిట్ సభ్యుల సహకారంతో నిర్వహించారు.



# ఉద్యోగాలు ఇచ్చే వారిగా ఎదగాలి

- చైర్మన్ డాక్టర్ ఎం.తేజోమూర్తి







**చిత్తూరు పెన్ పవర్ ఆగస్టు 22 :** ప్రతి ఒక్కరూ ఉద్యోగం పొందేవారు కాకుండా ఉద్యోగం ఇచ్చే వారిగా ఎదగాలని విజయం విద్యా సంస్థల చైర్మన్ డా. ఏం తేజోమూర్తి అన్నారు. శుక్రవారం, మై భారత్ చిత్తూరు ఆధ్వర్యంలో విజయం బిజినెస్ స్కూల్ ప్రాంగణంలో స్టార్ట్ అప్ ఇండియా మీద ఒకరోజు కార్యశాలను నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పెట్టుబడి అవకాశాలను ప్రారంభించాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యాపార అవకాశాలను ప్రభుత్వం తరపున అందజేసే రాయితీలను గురించి బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ చదువుతున్న విద్యార్థులకు అవగాహన కల్పించారు. మొదటిగా దీప ప్రజ్వలనతో ఈ కార్యక్రమం మొదలైంది. జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సి.సూరిబాబు విద్యార్థులకు పరిశ్రమలకు సంబంధించి చిత్తూరు జిల్లాలో ఉన్న అవకాశాల గురించి వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ హరీష్ మాట్లాడుతూ బ్యాంకుల రాయితీలు, పూచి కత్తులేని రుణాలు ఏ విధంగా పొందవచ్చనేది వివరించారు. విద్యార్థి విద్యార్థినులకు ఇంక్యువేషన్స్ సెంటర్స్ , ఇన్వెస్టర్స్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్ స్థాపనకు సంబంధించిన వివరాలు తెలియజేశారు. వ్యాపారం మొదలుపెట్టే ముందు ఎటువంటి జాగ్రత్తలు మరియు మార్గదర్శకాలు పాటించాలో విజయం బిజినెస్ స్కూల్ ప్రిన్సిపల్ డా. కె.జయంత్ తెలిపారు. ఈ కార్యశాలలో పాల్గొన్న విద్యార్థులకు మైభారత్ చిత్తూరు తరపున జిల్లా యువజన అధికారి బి.ప్రదీప్ కుమార్ ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మై భారత్ ప్రాంతీయ గణాంకాధికారి ఎంసీ బాబు రెడ్డి, మై భారత్ సిబ్బంది రాజకుమారి, నిత్యానందం, కె.హరీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# 23న శనివారం జిల్లా అంతటా స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



**కర్నూలు, ఆగస్టు 22 :** ఈనెల 23వ తేది శనివారం జిల్లా అంతటా స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర, ఉపాధి హామీ తదితర అంశాలపై డివిజన్, మండల స్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని మాన్సూన్ హైజీన్ అనే థీమ్‌తో నిర్వహించడం జరుగుతోందన్నారు.. ఇందులో భాగంగా పారిశుద్ధ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు.. అలాగే డ్రైనేజీల శుభ్రం, నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో నీటి తొలగింపు వంటి కార్యక్రమాలు చేపట్టాలని, దోమలు వృద్ధి చెందకుండా నిర్మూలన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పారిశుధ్యం అంశంలో ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల నుండి ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నారని, ప్రజల నుండి సానుకూల స్పందన వచ్చే విధంగా ఇంటింటి నుండి చెత్త సేకరణ జరగాలని కలెక్టర్ ఆదేశించారు. శనివారం స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా అంతటా ర్యాలీలు, అవగాహన సదస్సులు, సమావేశాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. స్వచ్ఛాంధ్ర,స్వర్ణాంధ్ర కార్యక్రమంలో మెరుగైన సేవలు అందిస్తున్న వారికి తగిన గుర్తింపును ఇచ్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వచ్చే అక్టోబరు 2వతేదీ గాంధీ జయంతినాడు అవార్డులను ప్రదానం చేయడం జరుగుతుందని తెలిపారు. స్వచ్ఛ మున్సిపాలిటీ,స్వచ్ఛ గ్రామం,స్వచ్ఛ పాఠశాల,స్వచ్ఛ అంగన్వాడీ కేంద్రం,స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయం, ప్రభుత్వాసుపత్రి సహా ఉత్తమ ఎన్జిఓలు,గ్రీన్ అంబాసిడర్లు తదితర కేటగిరీల్లో ఉత్తమంగా సేవలందించిన వారిని ఎంపిక చేసి జిల్లా,రాష్ట్ర స్థాయిల్లో అవార్డులు అందించడం జరుగుతుందన్నారు. అందువల్ల స్వచ్ఛాంధ్ర,స్వర్ణాంధ్ర లో ముమ్మరంగా పాల్గొని మంచి సేవలందించి అవార్డులు పొందాలని కలెక్టర్ సూచించారు. హొళగుంద మండలంలోని మద్ది లింగడహళ్లి గ్రామంలో చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదని ఫిర్యాదులు చేశారని, ఆ గ్రామంలో పారిశుధ్యానికి సంబంధించి తగిన చర్యలు తీసుకున్నారా అని కలెక్టర్ ఎంపిడిఓ ను ప్రశ్నించారు. గ్రామానికి వెళ్ళి పరిశీలించి తగిన చర్యలు తీసుకున్నామని ఎంపీడీవో కలెక్టర్ కు వివరించారు. అదే విధంగా దేవనకొండ మండలం కరివేముల, పాలకుర్తి, ఆదోని మండలం కడితోట, ఆస్పరి మండలం ఆస్పరి, కైరుప్పల, కౌతాళం మండలం నడిచాగి, పత్తికొండ మండలం పుచ్చకాయలమాడ, వెల్దుర్తి మండలం అల్లుగుండు, కోసిగి మండలం వండగల్ గ్రామాల్లో చెత్త సేకరణ జరగడం లేదని ప్రజలు ఫిర్యాదులు చేశారని, ఈ గ్రామాల్లో ప్రతి రోజు చెత్త సేకరణ జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత మండల ఎంపిడిఓ లను ఆదేశించారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి కూలీలకు పనులు కల్పించడంలో ఇప్పటివరకు నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించడం జరిగిందన్నారు..ప్రస్తుతం వర్షాలు రావడం వల్ల అంతగా పనులు జరగలేదని, వర్షాలు తగిన తర్వాత పనుల కల్పనపై దృష్టి పెట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కుటుంబానికి సగటున ఉపాధి కల్పనలో, 100 రోజుల పని దినాలు కల్పనలో పురోగతి తీసుకొని రావాలని కలెక్టర్ తెలిపారు... ముఖ్యంగా 70,80,90 రోజుల పనిదినాలు పూర్తి చేసిన కుటుంబాలపై ప్రత్యేక దృష్టి సారించి 100 రోజులు పని దినాలు కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సగటు వేతన రేటు కల్పించడంలో కూడా ప్రగతి సాధించాలని, ఆదోని, కోసిగి, కౌతాళం, ఓర్వకల్లు, పెద్ద కడుబూరు, గూడూరు, చిప్పగిరి, దేవనకొండ, నందవరం, ఆస్పరి మండలాలు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సంబంధిత మండలాల ఎంపిడిఓ లను ఆదేశించారు. ఫారం పాండ్స్ కు సంబంధించి 8 వేల 500 కి గాను 3 వేల 497 ఫారం ఫండ్ లు పూర్తి చేయడం జరిగిందని, పెండింగ్ లో ఉన్న వాటిని త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు... మద్దికెర, కౌతాళం లాంటి మండలాలు పనులు బాగా చేసి 62 శాతంలో ఉన్నారని, గోనెగండ్ల, వెల్దుర్తి, సి. బెలగల్, దేవనకొండ, గూడూరు లాంటి మండలాలు 35 శాతం కంటే తక్కువ పనులు చేశారన్నారు.. సంబంధిత మండలాలు ఫారం పాండ్ ల నిర్మాణంపై దృష్టి పెట్టి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# సాంఘిక సంక్షేమ వసతి గృహాలపై విద్యార్థుల తల్లిదండ్రులలో నమ్మకం

## మంత్రి డా.డోలా బాల వీరాంజనేయస్వామి







**తిరుపతి పెన్ పవర్, ఆగస్టు 22 :** సంక్షేమ వసతి గృహాల్లో 100 శాతంఅడ్మిషన్లు, ఉత్తీర్ణతే లక్ష్యంగా పనిచేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రివర్యులు డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. శుక్రవారం ఉదయం సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక కచ్చపి ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన రీజనల్ కాన్ఫరెన్స్ లో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రివర్యులు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ.... సంక్షేమ వసతి గృహాల్లో 100 శాతం అడ్మిషన్లు, ఉత్తీర్ణతే లక్ష్యంగా పనిచేయాలన్నారు. డైట్ మరియు వసతి గృహాల మరమ్మతుల బిల్లులను సకాలంలో అప్లోడ్ చేయాలన్నారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాల తనిఖీలను విధిగా చేపట్టాలని ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్లు జిల్లా సాంఘిక సంక్షేమ సహాయ సంక్షేమ అధికారులను మంత్రి ఆదేశించారు సంక్షేమ హాస్టల్లో చదివే విద్యార్థులు తమ చదువుల్లో మెరుగైన పనితీరు కనబరిచేందుకు మూడు గ్రూపులుగా వర్గీకరించాలన్నారు. విద్యార్థులను తమ సొంత బిడ్డలుగా చూసుకోవాలని వారి అభ్యున్నతికి శాఖలోని అధికారులు అందరూ దోహదపడాలని మంత్రి సూచించారు.

వసతి గృహాల మరమత్తుల నిమిత్తం రూ. 143 కోట్లు, నూతనంగా నిర్మించే హాస్టల్ భవనాలకు రూ. 100 కోట్లకు పైగా, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి దాదాపు రూ. 50 కోట్లు విడుదల చేశామన్నారు. విద్యార్థుల విద్య, ఆరోగ్యంపై శ్రద్ధ వహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నా రు.అలాగే వసతుల మెరుగుపై ప్రత్యేక దృష్టి సారించామని, విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో అహ్లాదకరంగా ఉంటూ చదువుపై దృష్టి నిలిపేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో నూతనంగా హాస్టల్ భవనాలు నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి,ఉప ముఖ్యమంత్రి సూచనల మేరకు సాంఘీక సంక్షేమ వసతి గృహాల్లో మెనూలో నాణ్యమైన బియ్యం అందిస్తున్నా మన్నారు.ఇంటర్ లో, పదవ తరగతిలో గణనీయమైన మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించామన్నారు. మెరుగైన మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను సత్కరించుకోవడం వల్ల విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన పోటీతత్వం అలవడటంతో పాటు ఉత్తీర్ణత శాతం పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ లక్ష్యాలను క్షేత్రస్థాయికి చేర్చడానికి రీజనల్ వర్క్ షాపు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులకు ఉన్నతమైన భవిష్యత్ అందిస్తామన్న నమ్మకం తల్లితండ్రుల్లో కల్పించడమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామ న్నారు. హాస్టల్ లో ఉంటున్న విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, మంచి భోజనం ఏర్పాటు చేయాలని, వసతి సౌకర్యాలు బాగుండాలని ఆదేశించారు. రీజనల్ కాన్ఫరెన్స్ లను మొదటగా విజయవాడలో, అటుపై విశాఖపట్నం,నేడు తిరుపతిలో నిర్వహించామన్నారు.

సంక్షేమ వసతి గృహాలు లోని విద్యార్థులను నవోదయ గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షల్లోనూ అలాగే ఎంసెట్ ప్రవేశ పరీక్షలకు కూడా వ్రాసేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచిం చారు జిల్లా కలెక్టర్లు సంక్షేమ హాస్టల్లపై ప్రత్యేక దృష్టి పెడుతున్నార న్నారు. ఇందులో భాగంగా నేడు తిరుపతి జిల్లా కలెక్టర్ ఆర్ట్ ఆఫ్ లివింగ్ వారిచే తన సమక్షంలో ఎంఓయు కుదుర్చుకోవడం శుభపరి ణామం అన్నారు. సంక్షేమ వసతి గృహాల్లో జరగరాని సంఘటనలు ఏవైనా జరిగితే వాటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి తగు చర్యలు తీసుకోవాల న్నారు. నిరంతర పర్యవేక్షణ ద్వారా అలాంటి సంఘటనలు జరగకుండా చూసేందుకు వీలుంటుందన్నారు. ఆడపిల్లల హాస్టల్ లో అత్యవసర మరుగుదొడ్లను హాస్టల్లోపలే ఏర్పాటు చేయాలని ,అలాగే రెండు డస్ట్ బిన్లను కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కు సూచించారు. తిరుపతిలో స్టడీ సర్కిల్ ని తిరిగి ప్రారంభిస్తామన్నారు. తిరుపతి బైరాగి పట్టణంలో ఉన్న నర్సింగ్ విద్యార్థులకు జర్మన్ భాష పై ఎనిమిది నెలల పాటు శిక్షణ ఇస్తున్నా మని దాన్ని నేడు ప్రారంభిస్తున్నామన్నారు. వసతి గృహాల్లో ఎక్కువ మంది విద్యార్థులు ఉంటే వాటిని రెసిడెన్షియల్ పాఠశాలలుగా మారుస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి తెలిపారన్నారు. హాస్టల్లో మెనూ సక్రమంగా అమలు చేయాలని, సాంఘిక సంక్షేమ హాస్టల్ లోని వంట వారికి కూడా రెండు రోజులపాటు వంటపై శిక్షణ ఇస్తున్నామన్నారు .తమ శాఖలో కొత్త సంస్కరణలు చేపడుతున్నందున అన్ని అంశాల్లో నాణ్యమైన ఫలితాలు వచ్చేలా కృషి చేయాలని అధికారులకు మంత్రి దిశా నిర్దేశం చేశారు. సాంఘిక సంక్షేమ శాఖప్రిన్సిపల్ సెక్రటరీ ఎంఎం నాయక్ మాట్లాడుతూ ..సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించేలా సంబంధిత శాఖ అధికారులు వారి ఆధీనంలోని హాస్టలను అనునిత్యం పర్యవేక్షించాలన్నారు. తద్వారా వాటి స్థితిగతులు తెలుసుకోవడానికి వీలవుతుందన్నారు. ప్రతి డిప్యూటీ డైరెక్టర్,ఇతర అధికారులు శాఖా పరమైన సమీక్షలకు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. అద్దె భవనాలు లో నడుస్తున్న హాస్టల్లకు సంబంధించి ఆ ప్రాంతాల్లో భూములను గుర్తించాలన్నారు. ఎక్కడైనా వసతి గృహాలను మూసివేసి ఉంటే వాటిని పరిశీలించి అక్కడ 100% ఆక్యుపేషన్ ఉంటే అవసరమైన ప్రతిపాదనలు పంపాల న్నారు. విద్యార్థుల ఆరోగ్య పరీక్షల నిర్వహించి సంబంధిత ఫోటోలతో సహా జేఎన్ బి నివాస్ పోర్టల్ లో అప్లోడ్ చేయాలన్నారు. వసతి గృహాల వారీగా తల్లిదండ్రులు మరియు వారి సంరక్షకుల ఫోన్ నెంబర్లను తీసుకోవాలన్నారు. వసతి గృహాల్లో హాస్టల్ వెల్ఫేర్ అధికారులు తప్పనిసరిగా రాత్రి బస చేయాలన్నారు. డైట్ బిల్లులు సకాలంలో సమర్పించేలా డిప్యూటీ డైరెక్టర్లు బాధ్యత తీసుకోవాల న్నారు. వారు సహాయ సాంఘిక సంక్షేమ అధికారులతో క్రమం తప్పకుండా మానిటర్ చేయాలన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ బి. లావణ్య వేణి మాట్లాడుతూ.. సంక్షేమవసతి గృహాల బాధ్యతలు చేపడుతున్న వారికి ఓరియంటేషన్ ఇవ్వడం ఈ సదస్సు ఉద్దేశమ న్నారు రాష్ట్రంలో 1051 హాస్టల్లో ఉన్నాయని, అక్కడ విద్యార్థులకు ఉచిత బస, భోజన వసతితో పాటు విద్యను అందిస్తున్నామని, వాటిలో నాణ్యత పెరగాల్సిన అవసరం ఉందన్నారు.క్షేత్ర స్థాయి సిబ్బందిలో అవగాహన కల్పించాలని ఈ సదస్సును ఏర్పాటు చేశామన్నారు. 100% అడ్మిషన్లు, 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా అధికారులు కృషి చేయాలన్నారు. విద్యార్థుల ఆరోగ్య విషయంలో తక్కువ బరువు ఉన్న వారిని మామూలు బరువుకు తీసుకొని వచ్చేలా చర్యలు చేపట్టాల న్నారు. బలహీనంగా ఉన్న పిల్లలను గుర్తించి సంపూర్ణ ఆరోగ్య వంతులుగా చేసేలా తగు చర్యలు చేపట్టాలన్నారు. మరమ్మతుల కోసం 143 కోట్ల రూపాయలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు.సంక్షేమ వసతి గ్రహాల్లోని పిల్లలను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు .ఏ క్వార్టర్కు ఇచ్చిన నిధులు ఆ క్వార్టర్లోపే ఖర్చు చేసేలా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్లు ఇతర అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీ సుధ ఆ శాఖకు సంబంధించి అనంతపురం, చిత్తూరు, కర్నూలు, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు, వైయస్సార్ కడప ఉమ్మడి జిల్లాలకు సంబంధించి జిల్లాల వారీగా ప్రీ మెట్రిక్ మరియు పోస్ట్మెట్రిక్ వసతి గృహ భవనాల స్థితిగతులు, నమోదు వివరాలు, విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత మరియు ఆరోగ్య పరిరక్షణ, వసతి గృహాల పరిశుభ్రత మరియు నిర్వహణ, అనారోగ్యంతో ఉన్న విద్యార్థుల సంరక్షణపై మార్గదర్శకాలు, జిల్లాల వారీగా ఆరోగ్య పరీక్షల నిర్వహణ ,విద్యాభివృద్ధి మార్గదర్శకాలపై, అలాగే రాష్ట్ర స్థాయి ఎస్ఎస్సి ఇంటర్మీడియట్ ఫలితాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరంగా తెలియజేశారు .ఈ అంశాల్లో మంత్రి, ఆ శాఖకు చెందిన ప్రిన్సిపల్ కార్యదర్శి, డైరెక్టర్ సదస్సుకు హాజరైన అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సదస్సులో సాంఘిక శాఖ డిప్యూటీ డైరెక్టర్లు, జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ మరియు సాధికారత అధికారులు,ఏఎస్ డబ్ల్యూఓలు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మనకు అత్యంత ముఖ్యమైన సమయం, ముఖ్యమైన వ్యక్తి, ముఖ్యమైన పని ఏమిటో మనకు తెలుసా?

**– సేకరణ సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి**



Shri.S.Krishna Reddy
REGIONAL DIRECTOR, EDUCATIONAL CELL, A.P&TS

కడప పెన్ పవర్ ఆగస్టు 22. మూడు ప్రశ్నలు ఒకప్పుడు ఒక రాజుకు మూడు విషయాలకు సమాధానం దొరికితే, జీవితంలో ఎప్పుడూ విఫలం అవమనే ఆలోచన వచ్చింది. ఈ మూడు విషయాలు ఏమిటంటే: అత్యంత ముఖ్యమైన సమయం ఏమిటి? అత్యంత ముఖ్యమైన వ్యక్తులు ఎవరు? అతను చేయవలసిన ముఖ్యమైన కార్యం ఏమిటి? అందువల్ల, రాజు ఈ మూడు ప్రశ్నలకు సమాధానమిచ్చిన వారికి భారీ మొత్తంలో ధనం ఇస్తానని వాగ్దానం చేస్తూ, మొత్తం రాజ్యంలో ఈ సందేశాన్ని వ్యాప్తి చేయడానికి తన దూతలను పంపాడు. చాలా మంది జ్ఞానులు రాజు వద్దకు వచ్చారు, వారందరూ అతని ప్రశ్నలకు రకరకాల సమాధానాలు ఇచ్చారు. మొదటి ప్రశ్నకు సమాధానంగా, రాజు తప్పనిసరిగా ఒక దినచర్యను సిద్ధం చేసుకుని, దానిని ఖచ్చితంగా పాటించాలని కొందరు చెప్పారు. ఈ విధంగా మాత్రమే, అతను సరైన సమయంలో ప్రతిదీ చేయగలడని వారు అన్నారు. మరికొందరు ఏదైనా పని చేయడానికి సరైన సమయాన్ని ముందుగానే నిర్ధారించుకోవడం అసాధ్యం అని చెప్పారు. రాజ్యంలో జరుగుతున్నదంతా గమనించాలని, అనవసరమైన ఆనందాలకు దూరంగా ఉంటూ, ఆ సమయంలో అత్యవసరమైనవి మాత్రమే చేయాలని సూచించారు. మరికొందరు రాజుకు సరైన సమయంలో ఏ పని చేయాలో తెలుపడానికి సహాయపడే ఒక 'జ్ఞానుల సంఘం' అవసరమని చెప్పారు. ఎందుకంటే, ఇంకొకరి సహాయం లేకుండా ప్రతీ చర్యకు సరైన సమయాన్ని సరిగ్గా నిర్ధారించడం ఒక వ్యక్తికి అసాధ్యం. దానికి ప్రతిగా మరికొందరు అత్యవసరమైనవి కొన్ని రాజ్యానిర్ణయాలు ఉంటాయని చెప్తూ, ఇలాంటి విషయాలు సంఘం నిర్ణయం కోసం వేచి ఉండలేవు కదా. ఏదైనా పని చేయడానికి సరైన సమయాన్ని నిర్ణయించుకోవాలంటే, భవిష్యత్తులో దాని ప్రభావం ఎలా ఉంటుందో కూడా చూడాలని వారు అభిప్రాయపడుతూ, కేవలం మాంత్రికులు మాత్రమే దీన్ని చేయగలరని చెప్పారు. అందువలన, రాజు మాంత్రికులను సంప్రదించవలసి ఉంటుందని అన్నారు. రెండవ ప్రశ్నకు సమాధానమిస్తూ, రాజుకు అత్యంత అవసరమైన వ్యక్తులు అతని మంత్రులని కొందరు చెప్పారుబీ మరికొందరు, పూజారులు అన్నారు. మరికొందరు వైద్యులని అనగా, సైనికులను అత్యంత అవసరమైన వారిగా కొందరు ఎంచుకున్నారు. మూడవ ప్రశ్నకు సమాధానం – కొంతమంది వ్యక్తుల ప్రకారం శాస్త్రం అయితే, ఇతరులు యుద్ధాలను ఎంచుకున్నారు, మరికొందరు మతపరమైన ఆరాధన ముఖ్యం అన్నారు. తన ప్రశ్నలన్నింటికీ ఇలా విభిన్నమైన సమాధానాలను పొందడంతో, రాజు సంతృప్తి చెందలేదు, కనుక ఎవరికీ ఎటువంటి పారితోషికం ఇవ్వలేదు. బదులుగా, తన జ్ఞానానికి విస్తృతంగా ప్రసిద్ధి చెందిన ఒక సన్యాసి సలహా తీసుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఆ సన్యాసి ఒక గుడిసెలో నివసిస్తున్నాడు. అతను సాధారణ వ్యక్తులను మాత్రమే కలుస్తాడు, కాబట్టి రాజు సాధారణ దుస్తులు ధరించి, సన్యాసి గుడిసెకు కొంత దూరంలో అంగరక్షకుడి వద్ద తన గుర్రాన్ని విడిచిపెట్టి, ఒంటరిగా సన్యాసిని చూడడానికి వెళ్ళాడు. రాజు సన్యాసి గుడిసెకు చేరుకునేసరికి, తన గుడిసె ముందు ఆ సన్యాసి భూమిని త్రవ్వుతూండడం చూశాడు. రాజుకు నమస్కరించి తిరిగి త్రవ్వడం కొనసాగించాడు. సన్యాసి వృద్ధుడు, బలహీనుడు, కొద్దిసేపు పనిచేసిన తరువాత ఆగి, గట్టిగా ఊపిరి పీల్చుకుంటున్నాడు. ఊపిరి పీల్చుకోవడం కోసం ఆగిన సన్యాసిని చూసి రాజు దగ్గరకు వెళ్లి, " ఓ మహాజ్ఞాని, మూడు ప్రశ్నలకు సమాధానం కోసమని నేను మీ వద్దకు వచ్చాను: ఎవరికైనా అత్యంత ముఖ్యమైన సమయం ఏది? అత్యంత ముఖ్యమైన వ్యక్తులు ఎవరు? చేయవలసిన ముఖ్యమైన కార్యం ఏమిటి? " రాజు మాటలు విన్నా, సన్యాసి స్పందించకుండా త్రవ్వడం కొనసాగించాడు. "మీరు అలసిపోయారు, ఆ పార నాకివ్వండి, మీ బదులు నేను పని చేస్తాను. దయచేసి మీరు కాసేపు విశ్రాంతి తీసుకోండి", అన్నాడు రాజు. " ధన్యవాదాలు," అని రాజుకు తన పారను ఇచ్చి, సన్యాసి అక్కడే నేలమీద కూర్చున్నాడు. రాజు రోజంతా త్రవ్వుతూనే ఉన్నాడు. సూర్యుడు చెట్ల వెనుక అస్తమించడం ప్రారంభించాడు, చివరికి రాజు పారను నేలపై వదిలి ఇలా అన్నాడు: "స్వామీ, నా ప్రశ్నలకు సమాధానం కోసం నేను మీ వద్దకు వచ్చాను. మీరు నాకు సమాధానం చెప్పలేకపోతే చెప్పండి, నేను ఇంటికి తిరిగి వెళ్ళిపోతాను". "ఎవరో పరుగెత్తుకుంటూ వస్తున్నారు", అన్నాడు సన్యాసి. రాజు అటువైపు తిరిగి చూడగా, గడ్డంతో ఉన్న వ్యక్తి తమ వైపుకు పరిగెత్తుకుంటూ రావడం చూశాడు. రక్తం కారుతున్న తన పొట్టపై చేయి నొక్కి ఉంచాడు. రాజు వద్దకు రాగానే స్పృహతప్పి నేలపై పడిపోయాడు. రాజు, సన్యాసి ఆ మనిషి దుస్తులను తీసేసి చూడగా, అతని కడుపుపై పెద్ద గాయం ఉంది. రాజు ఆ గాయాన్ని శుభ్రం చేసి, రుమాలుతో కట్టు కట్టాడు, కానీ రక్తం ఆగలేదు. రాజు ఆ గాయానికి ఒక పెద్ద బట్టతో మళ్ళీ కట్టుకట్టాడు. అప్పుడు చివరకు రక్తస్రావం ఆగింది. కొంత సమయం తరువాత, ఆ వ్యక్తి కొంత తేరుకుని, త్రాగడానికి ఏదైనా ఇవ్వమని అడిగాడు. రాజు మంచినీళు తెచ్చి ఇచ్చాడు. ఆ సమయానికి సూర్యుడు అస్తమించడంతో గాలి కాస్త చల్లబడింది. సన్యాసి సహాయంతో, రాజు గాయపడిన వ్యక్తిని గుడిసెలోకి తీసుకెళ్లి మంచం మీద పడుకోబెట్టాడు. అతను విశ్రాంతిగా కళ్ళు మూసుకున్నాడు. రాజుగారు కూడా త్రవ్వి, త్రవ్వి బాగా అలసిపోయి నేలమీద పడుకుని గాఢనిద్రలోకి జారుకున్నారు. మేల్కొన్న తర్వాత అతను ఎక్కడ ఉన్నాడో, మంచం మీద పడుకున్న గడ్డం ఉన్న ఆ వింతవ్యక్తి ఎవరో గుర్తుకు రావడానికి కొంత సమయం పట్టింది. "నన్ను క్షమించండి !", రాజు మెలకువగా ఉండడం చూసి ఆ వ్యక్తి బలహీనమైన స్వరంతో అన్నాడు.

"నేను నిన్ను ఎరుగను, నిన్ను క్షమించడానికి ఏమీ లేదు" అన్నాడు రాజు. గడ్డం ఉన్న వ్యక్తి, "నీకు నేనెవరో తెలీదు, కానీ నాకు నువ్వు బాగా తెలుసు. నా సోదరుడిని చంపి, నా ఆస్తిని స్వాధీనం చేసుకున్నందుకు, నీపై ప్రతీకారం తీర్చుకోవడానికి వచ్చిన నీ శత్రువును. నీవు ఒంటరిగా సన్యాసిని చూడడానికి వెళ్తున్నట్లు నాకు తెలిసి, ఇంటికి వెళ్ళేటప్పుడు చంపాలని నిర్ణయించుకున్నాను. రోజంతా గడిచిపోయింది కానీ నీవు తిరిగి రాలేదు. కాబట్టి నేను దాక్కున్న ప్రదేశంనుండి బయటకు వచ్చాను, నన్ను గుర్తించిన నీ అంగరక్షకుడి పైకి కత్తి దూశాను, అతను నన్ను గాయపరిచాడు. అతని నుంచి ఎలాగోలా తప్పించుకుని పరుగు పరుగున ఇక్కడికి వచ్చాను. నేను నిన్ను చంపాలనుకున్నాను కాబట్టి నేను చనిపోయుండాలి కానీ మీరు నా ప్రాణాన్ని కాపాడారు. ఇప్పుడు, నేను జీవించి ఉన్నంత వరకు, నేను మీకు అత్యంత నమ్మకమైన దాసునిగా సేవ చేస్తాను. నా కుమారులను కూడా అలాగే చేయమని ఆజ్ఞాపిస్తాను. నన్ను క్షమించండి!" రాజు తన శత్రువుతో సంధి చేసుకున్నందుకు, అతని శత్రుత్వ భావాలను పోగొట్టి, నిజమైన స్నేహితుడిగా గెలుచుకున్నందుకు చాలా సంతోషించాడు. అతనిని క్షమించడమే కాకుండా, అతనిని చూసుకోవడానికి తన సేవకులను, వైద్యుడిని పంపుతానని చెప్పాడు. ఆ వ్యక్తికి ఆస్తిని తిరిగి ఇచ్చేస్తానని కూడా వాగ్దానం చేశాడు.

గాయపడిన వ్యక్తిని లోపల వదిలి, రాజు గుడిసెలోంచి బయటకు వెళ్లి సన్యాసి కోసం చుట్టూ చూశాడు. బయలుదేరే ముందు, అతను సన్యాసిని మరోసారి తన ప్రశ్నలు అడగాలని అనుకున్నాడు. సన్యాసి తన మోకాళ్లపై, ముందు రోజు తవ్విన మడులలో విత్తనాలు విత్తుతున్నాడు. రాజు సన్యాసి వద్దకు వెళ్లి ఇలా అడిగాడు, "ఓ మహాజ్ఞాని, నా ప్రశ్నలకు సమాధానం ఇవ్వమని చివరిసారిగా మిమ్మల్ని వేడుకుంటున్నాను." "మీకు ఇప్పటికే సమాధానాలు వచ్చాయి!" అన్నాడు సన్యాసి నేల వైపే వంగిచూస్తూ, ఆ తర్వాత నెమ్మదిగా రాజు వైపు చూసాడు. " ఎలా వచ్చాయి ? నాకు అర్థం కాలేదు?" అడిగాడు రాజు. "మీకేమీ అర్థం కాలేదా?" సన్యాసి ఇలా బదులిచ్చాడు. "నిన్న నువ్వు నా బలహీనతని చూసి జాలిపడి నా కోసం ఈ మడులు త్రవ్వకుండా ఉంటే నువ్వు వెళ్ళిపోయేవాడివి. అప్పుడు ఆ వ్యక్తి మీపై దాడి చేసి ఉండేవాడు. కాబట్టి మీరు ఈ మడులు త్రవ్వుతున్న సమయమే చాలా ముఖ్యమైన సమయం. నేను చాలా ముఖ్యమైన వ్యక్తిని, నాకు సహాయం చేయడం మీ అత్యంత ముఖ్యమైన కార్యం. తరువాత, ఆ వ్యక్తి మన వద్దకు పరుగెత్తుకుంటూ వచ్చినప్పుడు, మీరు అతనిని చూసుకున్నది కూడా చాలా ముఖ్యమైన సమయం, ఎందుకంటే మీరు అతని గాయాల మీద శ్రద్ధ చూపకపోతే, అతను మీతో సంధి చేసుకోకుండానే చనిపోయేవాడు. కాబట్టి అతనే ఆ సమయంలో అత్యంత ముఖ్యమైన వ్యక్తి, అతని కోసం మీరు చేసినది మీ అత్యంత ముఖ్యమైన కార్యం. ఎప్పుడూ గుర్తుంచుకోండి, ఒకే ఒక్క సమయం మాత్రమే ముఖ్యమైనది. ఆ సమయం 'ఇప్పుడు, ఈ క్షణం' మాత్రమే, మనం ఏదైనా చేసే అవకాశం ఉన్న ఏకైక సమయం. ఒక నిర్దిష్ట క్షణంలో మీ వద్ద ఉన్న వ్యక్తి అత్యంత ముఖ్యమైన వ్యక్తి, ఎందుకంటే భవిష్యత్తులో ఏమి జరుగుతుందో, మనం ఇంకెవరినైనా కలుస్తామేమో ఎవరికీ తెలియదు. ఆ క్షణంలో అత్యంత ముఖ్యమైన పని ఏమిటంటే, ఆ వ్యక్తికి మంచి చేయడమే, ఎందుకంటే మనం ఈ ప్రపంచంలోకి ఆ ఉద్దేశ్యంతోనే పంపబడ్డాం కాబట్టి". హార్ట్ ఫుల్ నెస్ పద్ధతి అంటే చైతన్య విస్తరణ, ధ్యానం ద్వారా మన అస్తిత్వపు దైవీకరణ. మన చైతన్యం విస్తరిస్తున్నప్పుడు, జీవితంలోని అన్ని అంశాలలో, హృదయం నుండి మార్గదర్శకత్వం ప్రారంభమవుతుంది.

**దాజీజి**

**హార్ట్ ఫుల్ నెస్ ధ్యానం,.. అనువాదబృందం ఆంధ్రప్రదేశ్**

# అక్టోబర్ 2వ తేదీ నాటికి టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు అప్పగించేలా చర్యలు

## – కడప సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి - ఎమ్మెల్యే మాధవి రెడ్డి, కమిషనర్ మనోజ్ రెడ్డి




**కడప, పెన్ పవర్ ఆగస్టు 22 :** కడప నగరపాలక పరిధిలో డ్రైనేజీ వ్యవస్థతో పాటు.. శివారు ప్రాంతాలను రహదారి, ప్రజా రవాణా వ్యవస్థను ప్రజలకు మరింత సులభతరం చేసేలా ప్రత్యేక చర్యలను తక్షణమే చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తామని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. శుక్రవారం సాయంత్రం కడప ఆర్డీవో సమావేశ మందిరంలో.. ఏర్పాటు చేసిన కడప నియోజకస్థాయి సమీక్షా సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తోపాటు ఎమ్మెల్యే మాధవి రెడ్డి, కేఎంసి కమిషనర్ మనోజ్ రెడ్డి, కడప ఆర్డీవో జాన్ ఇర్విన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... అన్ని రంగాల్లో సామాజిక, వాణిజ్య పరంగా పేరున్న కడప మున్సిపాలిటీ పరిధిలో అపరిష్కృతంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థ, రోడ్లను త్వరితగతన పూర్తి చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. అంతే కాకుండా నగర ప్రధాన ప్రాంతాలను.. నగర శివార్లలోని ప్రాంతాలను కలుపుతూ కడప నియోజకవర్గ పరిధిలో ప్రజా రవాణా వ్యవస్థను మెరుగు పరిచే చర్యలను చేపట్టే ప్రణాళికను రూపొందిస్తామన్నారు. రామాంజనేయపురం సమీపంలోని టిడ్కో గృహ సముదాయాల్లో, అలాగే చలమారెడ్డి పల్లె హౌసింగ్ కాలనీల్లో తాగునీరు, విద్యుత్ అన్ని రకాల మౌలిక సదుపాయాలను అక్టోబర్ 2వ తేదీ నాటికి పూర్తిచేసి లబ్ధిదారులకు అప్పగించేలా చర్యలు చేపట్టాలన్నారు. మెప్మా పరిధిలోని అన్ని స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులకు లబ్ది చేకూరిన గృహాలను అక్టోబర్ 2వ తేదీ నాటికి అందజేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అందుకు సంబంధించి.. కేటాయించిన గృహాలకు సంబంధించి రోడ్లు, డ్రైనేజీ, కుళాయిలు, విద్యుత్ ఎలాంటి సదుపాయాలు పెండింగ్ లేకుండా.. సంబందిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అంతేకాకుండా కాలనీల్లో కమ్యూనిటీ పార్కు, కమర్షియల్ కాంప్లెక్స్, ప్లాంటేషన్ వంటి లవ్లీహుడ్ పనులను పూర్తి చేయాలన్నారు. జిల్లాలోనే కాకుండా ప్రత్యేకించి.. ఎండోమెంట్, వక్ఫ్, క్రిస్టియన్ మిషనరీ భూములు కానీ.. అన్యాక్రాంతం కాకుండా కాపాడాల్సిన బాధ్యత సంబందిత శాఖల అధికారుల చేతుల్లోనే ఉందన్నారు. ఎక్కడైనా అలాంటి భూములు ఆక్రమణకు పాల్పడినట్లు తెలిస్తే.. ప్రభుత్వం తరపున కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందన్నారు. మైనార్టీ ఉమెన్స్, గర్ల్స్ స్కిల్ డెవెలప్మెంట్ కోర్సులను అందించేందుకు ప్రత్యేక దృష్టి సారించి.. మైనార్టీ సంక్షేమ, స్కిల్ డెవేలప్ మెంట్ అధికారులు మెప్మా అధికారులతో కలిసి.. లబ్ధిదారులను గుర్తించాలన్నారు. తద్వారా మైనారిటీ మహిళలకు సుస్థిర నైపుణ్యతతో జీవనోపాధిని కల్పించే అవకాశం ఉందన్నారు. హౌసింగ్ పథకం ద్వారా... కడప నియోజకవర్గ పరిధిలో దాదాపు 21వేల గృహాలు మంజూరు కాగా.. వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయని, త్వరితగతిన అన్ని రకాల సదుపాయాలతో.. గృహ నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. పౌర సరఫరాల శాఖ శాఖ ద్వారా.. నియోకవర్గంలో 83,143 లబ్దిదారులు ఉన్నారని.. అన్ని చౌక దుకాణాల ద్వారా రేషన్ సరుకులు సరఫరా చేయడం జరుగుతోందని, రాష్ట్ర ప్రభుత్వం తరపున లబ్ధిదారులందరికీ సెప్టెంబర్ 15 నుండి స్మార్ట్ కార్డుల పంపిణీ చేపడుతున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా.. అన్ని ఆరోగ్య కేంద్రాలు పటిష్టమైన సేవలు అందిస్తున్నామన్నారు. కడప నియోజకవర్గ పరిధిలో 13 పట్టణ ఆరోగ్య కేంద్రాల ద్వారా వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఇందులో 172 రకాల మందులు, 60 కి పైగా వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతోందన్నారు. కాగా సమీపంలోనే జిల్లా స్థాయి జిజిహెచ్ ఆసుపత్రి ఉండడంతో.. ఎక్కువగా అటు వెల్లడం జరుగుతోందన్నారు. స్థానికంగా ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్లలో కూడా ప్రజలు వైద్య సేవలను అందుకోవాలన్నారు. ఎమ్మెల్యే మాధవి రెడ్డి మాట్లాడుతూ.. విలువలతో కూడిన నాయకత్వం, పారదర్శకత తో కూడిన విధి నిర్వహణ అధికారులను కానీ, నాయకులను కానీ అత్యున్నత స్థాయికి తీసుకువెళుతాయన్నారు. ప్రజారవాణా వ్యవస్థలో భాగంగా కడప పాత బస్టాండులో పార్కింగ్, కొత్త బస్టాండు డిపో ఆవరణలో ఎస్పీడిసిఎల్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు 15 సెంట్ల స్థలం అవసరం అవుతుందని, అలాగే.. కడప నగరానికి నూతన 132 కెవి సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. సదరం కార్యక్రమం ద్వారా.. ఎంపిక చేసే ఎన్టీఆర్ పెన్షన్ భరోసా లబ్ది కోసం జిల్లాలో 200 పైగా, కడప నియోజక వర్గంలో 50 మందికి పైగా 100% అంగవైకల్యం ఉన్న వారు.. లబ్ది పొందలేకవడానికి కారణాలు ఏమిటని ప్రశ్నించారు. దీనిపై జిల్లా వైద్యాధికారులు పునఃపరిశీలించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. నగరంలోని చాలా పాఠశాలల్లో తాగునీరు, ఆర్.ఓ. ప్లాంట్లు, వాష్ రూములు, సింటెక్సులు, బెంచీల కొరత ఉందన్న విషయాన్ని గుర్తు చేస్తూ... నగరంలో కంటే గ్రామాల్లోనే వసతులు మెరుగుగా ఉన్నాయన్నారు. ఈ విషయంలో జిల్లా.కలెక్టర్ దృష్టి సారించాలన్నారు. అందుకు స్పందించిన జిల్లా కలెక్టర్ కడప కార్పోరేషన్ ప్రధాన బాధ్యతగా తీసుకుని కనీస మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. కడప నగరంలో డిప్యూటీ డీఈవో హోదాలో ఒకరిని నియమించేందుకు.. విద్యాశాఖ ద్వారా ప్రతిపాదనలు పంపించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఇరిగేషన్ కు సంబంధించి.. నగరంలో ఎలాంటి వరద ముప్పు అవకాశాలు లేవన్నారు. ప్రస్తుతం.. బుగ్గవంక ద్వారా ముంపు భద్రత లేకపోయినా.. బ్యూటిఫికేషన్‌లో భాగంగా లోనింగ్ రోడ్డు పనులు ఇంకా పూర్తి కావాల్సి ఉందన్నారు. ముఖ్యంగా కడప నగరంలో అభివృద్ధి తోపాటు ఆదాయాన్ని కూడా పెంచే మార్గాలను పెంచాలన్నారు. పట్టణ పరిధిలోని అన్ని నివాస ప్రాంతాల్లో టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి ప్రతి కట్టడానికి బిల్డింగ్ పర్మిషన్ తీసుకునేలా ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. ఈ ప్రక్రియను ప్రజలకు మరింత సులభతరం చేస్తూ... ప్రజలను మధ్యవర్తుల వద్దకు వెళ్లకుండా మున్సిపల్ అధికారులే ప్రత్యేక మేళా ద్వారా.. ప్రతి ఒక్కరూ టౌన్ ప్లానింగ్ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం డ్వామా, డిఆర్డీఏ, మెడికల్, ఐసిడిఎస్, విద్యాశాఖ, వ్యవసాయ మార్కెటింగ్, విద్యుత్ శాఖ, పరిశుధ్యం, రవాణా, ట్రాఫిక్, పరిశ్రమలు, వాణిజ్యం తదితర అంశాలపై... సంబందిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలు సమీక్షించి పలు సలహాలు, సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అన్నిశాఖల జిల్లాస్థాయి, డివిజనల్, నియోజకవర్గ స్థాయి అధికారులు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## నల్సా పథకములపై దివ్యాంగులకు/ప్రత్యేక పిల్లలకు

# న్యాయవిజ్ఞాన న్యాయవిజ్ఞాన సదస్సు:"





**కడప పెన్ పవర్ ఆగస్టు 22 :** 22-08-2925 వ తేదీన గౌరవ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ , అమరావతి వారి ఆదేశానుసారంగా గౌరవ చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప డాక్టర్ సి.యామిని వారి సూచనల మేరకు గౌరవ ఎస్.బాబా ఫక్రుద్దీన్, సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప వారు కడప నగరం శంకరాపురం నందు గల ప్రభుత్వ అందుల ఉన్నత పాఠశాల నందు దివ్యాంగులకు/ప్రత్యేక పిల్లలకు గౌరవ నల్సా పథకములపై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ (నల్సా) వారి బాలల సంరక్షణ కొరకు స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం 2024: లీగల్ సర్వీసెస్ అథారిటీ యాక్ట్ 1987, స్పెషల్ జోనల్ పోలీస్ యూనిట్, సపోర్ట్ పర్సన్స్ గార్డియన్ మరియు వార్డ్ యాక్ట్, బాలల మరియు కౌమార లేబర్ చట్టం 1986, బాలల హక్కుల పరిరక్షణ చట్టం 2005, పిల్లల నిషేధ వివాహ చట్టం 2006 బాల్య న్యాయ చట్టం 2015 ఉచిత మరియు నిర్బంధ విద్య కోసం పిల్లల హక్కు చట్టం 2009 లైంగిక నేరాల నుంచి పిల్లల సంరక్షణ చట్టం 2012 పిల్లల కోసం జాతీయ విధానం 2013 మిషన్ వాత్సల్య పథకం 2022 మోడల్ పోస్టర్ కేర్ మార్గదర్శకాలు 2024 పథకం కింద చర్యలు, సంరక్షణ మరియు రక్షణ అవసరమైన పిల్లలకు న్యాయ సేవలు న్యాయ సేవలు ప్రదాతలు మరియు సంస్థల బాధ్యతలు మొదలుకు వాటిని వివరించారు.

జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ (నల్సా) వారి మానసిక అనారోగ్యం ఉన్న వ్యక్తులు మరియు మేధో వైకల్యాలున్న వ్యక్తులకు చట్టపరమైన సేవలు పథకం 2024.. వికలాంగుల హక్కుల చట్టం 2016, మానసిక ఆరోగ్యం సంరక్షణ చట్టం 2017, జాతీయ మానసిక ఆరోగ్య విధానం 2014, జాతీయ ఆత్మహత్య నివారణ వ్యూహం 2022, జాతీయ టెలిమెంటల్ హెల్త్ ప్రోగ్రాం పథకం కింద చర్యలు మరియు జోక్యాలు మానసిక ఆరోగ్యం సంరక్షణ పొందే హక్కులు హక్కు వ్యక్తిగత పరిచయాలు మరియు కమ్యూనికేషన్, ముందస్తు మరియు భద్రత హక్కు, ఇంట్లో మరియు కుటుంబంతో నివసించే హక్కు, న్యాయం పొందే హక్కు, మానసిక ఆరోగ్యం వద్ద న్యాయ సేవలు స్థాపనలు మనోన్యాయ క్లినిక్లు చట్టపరమైన సేవల ప్రదాతలు మరియు సంస్థ యొక్క బాధ్యతలు, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100, చైల్డ్ లైన్ హెల్ప్లైన్ నెంబర్ 1098, దివ్యాంగజన్ హెల్ప్ లైన్ నెంబర్ 14456, ఉచిత న్యాయ సహాయము మొదలగు అంశాలను వివరించారు.

ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, కడప వారి దృష్టికి తీసుకొని రావచ్చును అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ వెల్ఫేర్ ఆఫ్ డిఫరెంట్ల ఏబుల్ ట్రాంజెండర్ అండ్ సీనియర్ సిటిజన్ శ్రీ కృష్ణ కిషోర్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు, వివిధ ప్రభుత్వ అధికారులు, ఎన్జీవోలు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, జిల్లాలోని వివిధ ప్రాంతాల దివ్యాంగులు మరియు దివ్యాంగా విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్య సామాజిక సంక్షోభం దిశగా పెరుగుతున్న వంధత్వం

**డా. ముచ్చుకోట .సురేష్ బాబు, అధ్యక్షుడు, ప్రజాసైన్స్ వేదిక**



**అనంతపురం పెన్ పవర్ ఆగస్టు 22 :** ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా 8-12 శాతం జంటలను వంధ్యత్వం ప్రభావితం చేస్తుంది, భారతదేశం కూడా దీనికి మినహాయింపు కాదు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే డేటా ఇటీవల విశ్లేషణలు, ప్రాథమిక వంధ్యత్వం - మొదటి బిడ్డను కనలేకపోవడం - 1990ల నుంచి క్రమంగా తగ్గుతున్నప్పటికీ, ముందస్తు జననం తర్వాత సంభవించే ద్వితీయ వంధ్యత్వం 1992%-%93లో 19.5 శాతం నుంచి 2015-16లో 28.6 శాతానికి బాగా పెరిగిందని చూపిస్తున్నాయి. ఈ పెరుగుతున్న ధోరణి ఆలస్య వివాహాలు, జీవనశైలి సంబంధిత వ్యాధులు, కాలుష్యం మరియు ఒత్తిడికి గురికావడానికి దగ్గరి సంబంధం కలిగి ఉంది. ఒకప్పుడు కుటుంబంలో నిశ్శబ్ద స్వరంలో వంధ్యత్వం గురించి మాట్లాడుకున్నప్పటికీ, ఇప్పుడు ప్రజారోగ్య సమస్యగా ఉద్భవిస్తోంది, జీవనశైలి మార్పులు, పర్యావరణ క్షీణత, ఆలస్యంగా తల్లిదండ్రుల బాధ్యతలు స్వీకరించడం అలాగే పాతుకుపోయిన సాంస్కృతిక అంచనాలతో ఇది లోతుగా ముడిపడి ఉంది. వంధ్యత్వానికి చాలా భిన్నమైన కారణాలు ఉన్నాయి. వంధ్యత్వానికి సంబంధించి ప్రత్యేక నిపుణుడిని చూడటం వలన పునరుత్పత్తి సమస్యలకు కారణమేమిటో ఏ చికిత్సలు ఉత్తమమైనవి అని గుర్తించడంలో సహాయపడుతుంది. వివరించలేని వంధ్యత్వం అనేది ఎటువంటి కారణం లేని వంధ్యత్వాన్ని సూచిస్తుంది. వివరించలేని వంధ్యత్వం చాలా కలత చెందినప్పటికీ, సాధారణంగా చికిత్స ఎంపికలు అందుబాటులో ఉన్నాయి. మహిళల్లో వంధ్యత్వానికి సాధారణ కారణాలు ప్రధానంగా క్రమరహిత కాలాలు. స్త్రీ చక్రం సగటున 28 రోజులు ఉంటుంది. కానీ, చక్రాలు స్థిరంగా ఉన్నంత కాలం, కొన్ని రోజుల లోపు ఏదైనా సాధారణమైనది గా పరిగణించబడుతుంది. ఒక నెలలో 33-రోజుల చక్రం, తర్వాత నెలలో 31-రోజుల చక్రం మరుసటి నెలలో 35-రోజుల చక్రం ఉన్న స్త్రీకి "సాధారణ" పీరియడ్స్ వచ్చే అవకాశం ఉంది. సక్రమంగా పీరియడ్స్ వచ్చే స్త్రీకి చక్రాలు మారుతూ ఉంటాయి, ఆమెకు పీరియడ్స్ ఎప్పుడు వస్తుందో కూడా ఊహించలేము. ఇది హార్మోన్ల సమస్యలు లేదా పాలిసిస్టిక్ ఒవేరియన్ సిండ్రోమ్ వల్ల కావచ్చు. ఈ రెండు కారకాలు వంధ్యత్వానికి దోహదం చేస్తాయి. మహిళల్లో హార్మోన్ హెచ్చుతగ్గులు సంభావ్య సంతానోత్పత్తి సమస్యలను సూచిస్తాయి. చర్మ సమస్యలు, బరువు పెరుగుట, ముఖ జుట్టు పెరుగుదల, తగ్గిన సెక్స్ డ్రైవ్, జుట్టు పలచబడుతోంది ఇలాంటి సందర్భాలలో డాక్టర్‌ను సంప్రదించాలి. కొంత మంది స్త్రీలు తమ జీవితాంతం బాధాకరమైన సెక్స్‌ను కలిగి ఉంటారు, ఇది హార్మోన్ల అసమతుల్యత, ఎండోమెట్రియోసిస్ లేదా వంధ్యత్వానికి దోహదపడే ఇతర అంతర్లీన పరిస్థితుల వల్ల కావచ్చు.

**జీవనశైలి మరియు ఆరోగ్యం ప్రధాన అంశం :**

వైద్య నిపుణులు జీవనశైలి ఎంపికలను వంధ్యత్వానికి కీలకమైన చోదకాలుగా సూచిస్తున్నారు. కెరీర్ లేదా ఆర్థిక భద్రత కోసం వివాహం వాయిదా వేయడం సర్వసాధారణం, కానీ వయస్సు పెరగడం ముఖ్యంగా మహిళలకు సంతానోత్పత్తి సామర్థ్యాన్ని తగ్గిస్తుంది. ధూమపానం, మద్యపానం, ఫాస్ట్ ఫుడ్ ఆహారం వంటి అనారోగ్యకరమైన అలవాట్లు స్పెర్మ్ నాణ్యత అండాశయ పనితీరును దెబ్బతీస్తున్నాయి. ఊబకాయం, నిశ్చల జీవనశైలి సమస్యను మరింత తీవ్రతరం చేస్తాయి. అధిక శరీర ద్రవ్యరాశి సూచిక హార్మోన్ల అసమతుల్యత, క్రమరహిత ఋతు చక్రాలు, ఇన్సులిన్ నిరోధకతతో ముడిపడి ఉంది, ఇవన్నీ సంతానోత్పత్తిని తగ్గిస్తాయి. ఆధునిక పట్టణ జీవితంలో మరొక ముఖ్య లక్షణం, దీర్ఘకాలిక ఒత్తిడి, పురుషులు మహిళలు ఇద్దరిలోనూ హార్మోన్ల సమతుల్యతను దెబ్బతీస్తుంది, పునరుత్పత్తి సవాళ్లను మరింత తీవ్రతరం చేస్తుంది. పర్యావరణ బహిర్గతం కూడా నిశ్శబ్ద దోషిగా ఉద్భవించింది. పురుగుమందులు, పారిశ్రామిక విషపదార్థాలు, పెరుగుతున్న గాలి నీటి కాలుష్యం స్థాయిలు స్పెర్మ్ నాణ్యతను దెబ్బతీస్తాయని, హార్మోన్ల పనితీరు మారుస్తాయని పునరుత్పత్తి ఆరోగ్య ప్రమాదాలను పెంచుతాయని చూపబడింది. పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్, థైరాయిడ్ రుగ్మతలు డయాబెటిస్ వంటి వైద్య పరిస్థితులు భారాన్ని పెంచుతాయి.

**సామాజిక మరియు సాంస్కృతిక భారం :**

భారతదేశంలో వంధ్యత్వం అనేది కేవలం వైద్యపరమైన సమస్య కాదు - ఇది చాలా సామాజికమైనది. తల్లిదండ్రులు గా ఉండటం కుటుంబ జీవితానికి కేంద్రంగా పరిగణించబడుతుంది. పిల్లలు లేకపోవడం తరచుగా తీవ్ర కళంకాన్ని కలిగిస్తుంది. అనేకచోట్ల సమాజాలలో, వంధ్యత్వంతో పోరాడుతున్న జంటలు సామాజిక బహిష్కరణ, భావోద్వేగ బాధ, చాలా సందర్భాల్లో, వైవాహిక విభేదాలను ఎదుర్కొంటారు. ముఖ్యంగా మహిళలు నిందలు, మానసిక క్షోభ అనుభవిస్తున్నారు, తరచుగా సూక్ష్మ వివక్ష, కుటుంబ ఒత్తిడి మరియు గృహ హింసకు గురవుతారు. "పిల్లలు లేకపోవడం ఆరోగ్య పరిస్థితి కంటే వ్యక్తిగత వైఫల్యంగా పరిగణించబడుతుంది" అని కుటుంబ గతిశీలత అధ్యయనం చేసే సామాజిక శాస్త్రవేత్తలు అంటున్నారు. . "స్త్రీత్వం యొక్క ముఖ్యమైన గుర్తుగా మాతృత్వంపై సాంస్కృతిక ప్రాధాన్యత వంధ్యత్వానికి మహిళలకు ముఖ్యంగా వినాశకరమైనదిగా చేస్తుంది." పరిణామాలు వ్యక్తి మించి విస్తరించాయి. సాంప్రదాయ సమాజములో, పిల్లలను వృద్ధాప్య భద్రత కుటుంబ వంశపారంపర్యానికి వెన్నెముకగా చూస్తారు. పిల్లలు లేకపోవడం జంటలను సమాజ జీవితం నుండి వేరు చేస్తుంది, అదే సమయంలో తరువాతి సంవత్సరాల్లో మానసిక ఒత్తిడి, ఆర్థిక అభద్రతను కూడా సృష్టిస్తుంది. వంధ్యత్వానికి ఇప్పటికీ నిర్మాణాత్మక ఆరోగ్య సమస్యగా కాకుండా జంటల ప్రైవేట్ సమస్య గా పరిగణిస్తున్నారు . ప్రభుత్వ ఆసుపత్రులు అరుదుగా సమగ్ర వంధ్యత్వ సంరక్షణను అందిస్తాయి, దీనివల్ల జంటలు ఖరీదైన ప్రైవేట్ క్లినిక్‌లపై ఆధారపడతారు. సరసమైన, అందుబాటులో ఉన్న చికిత్స లేకపోవడం అసమానతలను మరింత పెంచుతుంది, పునరుత్పత్తి ఆరోగ్య కార్యక్రమాలను విస్తరించడం ద్వారా వంధ్యత్వ నిర్ధారణ చికిత్స చేర్చడం ద్వారా నిపుణులు బహుముఖ ప్రతిస్పందన అవసరం. లైంగికంగా సంక్రమించే అంటువ్యాధులు, ఆహారం, నిశ్చల జీవనశైలి వంటి నివారించగల కారణాల గురించి అవగాహన పెంచడం. ఫలితాలను మెరుగుపరచడానికి ముందస్తు సంప్రదింపులు అలాగే సకాలంలో వైద్య సంరక్షణను ప్రోత్సహించడం. మానసిక క్షోభను ఎదుర్కోవడానికి కౌన్సిలింగ్ సామాజిక మద్దతును అందించడం పై ప్రభుత్వం శ్రద్ధ వహించాలి.

# హాస్పిటల్లో చేరిన అంబానీ తల్లి కోకిలాబెన్.. పరిస్థితి విషమం!



**పెన్ పవర్ డెస్క్:** రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ అయినటువంటి ముఖేష్ అంబానీ తల్లి కోకిలాబెన్ అంబానీ ఆరోగ్య పరిస్థితి చాలా విషమంగా ఉంది అంటూ జాతీయ మీడియా ఛానల్స్ లో వార్తలు వినిపిస్తున్నాయి.. మరి ఇంతకీ ముకేశ్ అంబానీ తల్లి కోకిలాబెన్ కి ఏమైంది..? ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి వస్తున్న వార్తల్లో ఉన్న నిజమెంత? అనేది ఇప్పుడు తెలుసుకుందాం..

**విషమంగా అంబానీ తల్లి ఆరోగ్యం..**

దిగ్గజ పారిశ్రామికవేత్తగా.. రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేతగా..దేశంలోనే కాదు ప్రపంచంలోనే ఎన్నో పేరు ప్రఖ్యాతలు గాంచిన ముకేశ్ అంబానీ అంటే తెలియని వారు ఉండరు.. దేశంలో అత్యంత సంపన్నుడిగా పేరు తెచ్చుకున్న అంబానీ కి సంబంధించి ఏ విషయమైనా సరే క్షణాల్లో చాలా వైరల్ గా మారుతుంది. అయితే అలాంటి ముకేశ్ అంబానీ తల్లి గురించి తాజాగా ఒక సంచలన విషయం వెలుగు లోకి వచ్చింది. అదేంటంటే..ముఖేష్ అంబానీ తల్లి కోకిలాబెన్ అంబానీ గారి ఆరోగ్య పరిస్థితి చాలా విషమంగా ఉందని, జాతీయ మీడియా ఛానల్స్ లో గత కొద్ది గంటల నుండి వార్తలు వినిపిస్తున్నాయి.

**91 ఏళ్ల వయసులో హాస్పిటల్లో చేరిన కోకిలాబెన్..**

91 ఏళ్ల వయసు ఉన్న ముఖేష్ అంబానీ తల్లి కోకిలాబెన్ వృద్ధాప్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నట్టు తెలుస్తోంది. దాంతో కోకిలాబెన్ ని వెంటనే ముంబైలోని %ఎచ్% రిలయన్స్ హాస్పిటల్ కి శుక్రవారం ఉదయం తీసుకువెళ్లినట్టు తెలుస్తోంది. కోకిలాబెన్ ని ప్రత్యేకమైన హెలికాప్టర్ ద్వారా హాస్పిటల్ కి తీసుకు వెళ్లినట్టు జాతీయ మీడియాలో వార్తలు వినిపిస్తున్నాయి. అయితే కోకిలాబెన్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది అనే విషయం తెలియడంతోనే అంబానీ కుటుంబ సభ్యులందరూ హుటాహుటిన ముంబైలోని రిలయన్స్ హాస్పిటల్ కి వెళ్తున్న వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. ఇప్పటికే ముకేశ్ అంబానీ ఫ్యామిలీ మొత్తం టైట్ సెక్యూరిటీతో హెచ్ ఎన్ హాస్పిటల్ కి చేరుకున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి.అలాగే ముకేశ్ అంబానీ సోదరుడు అనిల్ అంబానీ కూడా ఆయన భార్యతో కలిసి హెచ్ ఎన్ హాస్పిటల్ కి వెళ్లారు..

**ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందంటే?**

అయితే ఉదయం నుండి కోకిలాబెన్ ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉన్నట్టు జాతీయ మీడియాలో వార్తలు వినిపిస్తున్నప్పటికీ ఇప్పటివరకు ముకేశ్ అంబానీ ఫ్యామిలీ నుండి ఎలాంటి అధికారిక ప్రకటన కూడా రాలేదు. అలాగే కోకిలాబెన్ ని జాయిన్ చేసిన హెచ్ఎన్ హాస్పిటల్ నుండి కూడా డాక్టర్లు ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి ఎలాంటి సమాచారం కూడా ఇవ్వలేదు.. ప్రస్తుతం కోకిలాబెన్ ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉన్నట్టు తెలుస్తోంది. సీనియర్ డాక్టర్ ల పర్యవేక్షణలో కోకిలాబెన్ కి ట్రీట్మెంట్ అందిస్తున్నట్టు సమాచారం.

# సీరియస్-చర్యలు తప్పవ్-ఆగ్రహం: ఇంతేగా ..!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇవీ.. తప్పులు చేస్తున్న తమ్ముళ్లకు సంబంధించి టీడీపీలో జరుగుతున్న చర్చ. అంతేకాదు.. అనుకూల మీడియాలో పెద్ద ఎత్తున వస్తున్న వార్తల సారాంశం కూడా. కానీ.. ఎక్కడా చర్యలు తీసుకుంటున్న పరిస్థితి కనిపించడం లేదు. దీంతో తప్పులు చేసిన వారు లైట్ తీసుకుంటున్నారు. మిగిలిన వారు కూడా వీటినే ఆదర్శంగా తీసుకుంటున్నారు. దీంతో ఎక్కడా తమ్ముళ్లకు చెక్ పడడం లేదన్నది తెలిసిందే.

తాజాగా శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డారాజశేఖర్ వ్యవహారం వెలుగు చూసిన తర్వాత.. ఎక్కువ మంది చెప్పిన మాట ఏంటంటే.. "బాబుగారు.. అలా అంటారు అంతే!. ఏం చేస్తారు. ఎవరిని వదులుకుంటారు?" అనే. మెజారిటీ నాయకుల్లో ఇదే తరహా పరిస్థితి నెలకొంది. అయితే.. చంద్రబాబు సీరియస్ అవుతున్నా.. చర్యలు తీసుకోకపోవడానికి రెండు కారణాలు ఉన్నాయి. వారే తెలుసుకుంటారు అనే ఆలోచనతో పాటు.. అందరూ పెద్ద వాళ్లే అనే ఆలోచన. ఈ రెండు కారణాలతో ఆయన దూకుడుగా నిర్ణయాలు తీసుకోలేక పోతున్నారున్నది వాస్తవం.కానీ, అవకాశం ఇచ్చారన్న కారణంగా.. నాయకులను చంద్రబాబు వెనుకేసుకు వస్తున్నట్టు కాదు. గతంలో వైసీపీ నేతలు తప్పు చేస్తే.. వెనుకేసుకువచ్చిన పరిస్థితి ఉంది. అప్పటి ఎంపీ గోరంట్ల మాధవ్ తప్పు చేస్తే.. ఆయనను ఉపేక్షించారు. ఎమ్మెల్సీ అనంతబాబు తప్పు చేస్తే.. కనీసం పార్టీ నుంచి సస్పెండ్ చేయడానికి కూడా వారాల తరబడి సమయం తీసుకున్నారు. పన్నెత్తు హెచ్చరిక కూడా చేయలేదు. కానీ, అలా కాకుండా.. చంద్రబాబు ఎప్పటికప్పుడు హెచ్చరిస్తున్నారు. మారాలని కోరుతున్నారు.ఈ సున్నిత విషయాన్ని చంద్రబాబు ఆలోచనను అర్థం చేసుకోలేక పోతున్న తమ్ముళ్లు.. "తప్పులు చేసిన వారిని ఏం చేశారు? మేం చేస్తే మాత్రం తప్పేముంది?" అనే ధోరణిలో వ్యవహరిస్తున్నారు. ఈ పరిణామ మే వారికి ఆయుధంగా కూడా మారుతోంది. కానీ, ఇది ఎంత వరకు సమంజసం? అనేది ప్రశ్న. హెచ్చరిక లు, నివేదికలు అని కోరుతున్నారంటే.. ఎమ్మెల్యేల స్థాయికి ఇవి కొరడా ఝుళిపించినట్టే. కానీ, అర్థం చేసుకునే వారు మాత్రం కొరవడుతున్నారు. ఇలానే కొనసాగితే.. వారికి వచ్చే ఎన్నికల నాటికి కష్టాలు ఖాయం అంటున్నారు సీనియర్లు.

# బాబు -బాబో - బాబోయ్ .. !

**హైదరాబాద్ పెన్ పవర్:** సీఎం చంద్రబాబు తీసుకుంటున్న నిర్ణయాలు.. మంచివే అయినా.. తమ్ముళ్లలో గుబులు రేపుతున్నాయి. నేరుగా చంద్రబాబు వారిని ఏమీ అనకపోయినా.. ఇటు సోషల్ మీడియాలోను.. అటు ప్రధాన మీడియాలో ను పెద్ద ఎత్తున వస్తున్న విశ్లేషణలు, వార్తలు.. నాయకులను ఉక్కిరి బిక్కిరికి గురి చేస్తున్నాయి. దీనికి ప్రధాన ఉదాహరణ పీ-4. ఈ కార్యక్రమం కింద ధనవంతులైన వారు పేదలను దత్తత తీసుకోవాలని చంద్రబాబు చెబుతున్నారు. తాను స్వయంగా 250 కుటుంబాలను దత్తత తీసుకున్నానని పదే పదే చెబుతున్నారు. తీసుకున్నారు కూడా.అయితే.. ఈ పరిణామం.. స్థానికంగా ఎమ్మెల్యేలు, ఎంపీలపైనా ప్రభావం చూపుతోంది. జిల్లాల వారీగా ఉన్న నాయకులపై వార్తలు వచ్చేలా సోషల్ మీడియాలో కామెంట్లు వచ్చేలా కూడా చేస్తోంది. ఇది ఇబ్బందిగా మారింది. ప్రస్తుతం టీడీపీలో 70 శాతం మంది ఎమ్మెల్యేలు, 90 శాతంమంది ఎంపీలు అత్యంత ధనవంతులు. గుంటూరు ఎంపీ దేశంలోనే అత్యంత ధనవంతుడైన ఎంపీగా ఉన్నారన్నది తెలిసిందే. వీరంతా కూడా పీ-4లో ఎందుకు భాగస్వామ్యం కావడం లేదన్నది ప్రస్తుతం జరుగుతున్న చర్చ.అయితే.. వారు మాత్రం అనేక కోణాల్లో ఆలోచన చేస్తున్నారు. పేదరికాన్ని రూపు మాపడం మంచిదే అయినా.. అది సాధ్యం కాదన్నది నిశ్చితాభిప్రాయం. పైగా.. రాజకీయాల్లో ఉన్న నాయకులు చేయలేమని.. చెబుతున్నారు.అలాగని వారిపై వస్తున్న వార్తలను, సోషల్ మీడియా కామెంట్లను మాత్రం వారు ఆపలేక పోతున్నారు. ఈ పరిణామమే .. ఇబ్బందిగా మారింది. దీంతో చంద్రబాబు సంకల్పంపై కొందరు అంతర్గత చర్చల్లో బాబోయ్ అనేస్తున్నారు. వాస్తవానికి చంద్రబాబు ఎవరినీ ఒత్తిడి చేయడం లేదు.పైగా పీ-4లో మార్గదర్శకులుగా చేరేవారు తమ ఇష్టానుసారంగా చేరొచ్చని కూడా ఇటీవల తేల్చి చెప్పారు. ఈ విషయంలో చంద్రబాబు క్లారిటీతోనే ఉన్నారు. అయినప్పటికీ.. ఎంపీలు, ఎమ్మెల్యేలపై మాత్రం ఒత్తిడి పెరుగుతోంది. ఈ క్రమంలో తాజాగా ఒకరిద్దరు ఎంపీలు.. పీ-4లో నేరుగా తాము జోక్యం చేసుకోకుండా. కొంత మేరకు ఫండ్ ఇస్తామని.. పీ-4 ఫండ్ ఏర్పాటు చేయాలని చంద్రబాబు కు సూచనలు చేశారు. ఇది కూడా మంచిదే. సమాజంలో అందరూ నేరుగా దత్తత తీసుకోకపోయినా.. ఫండ్ ఇచ్చేందుకు రెడీగా ఉంటారు. మరి దీనిని సాకారం చేస్తే.. చంద్రబాబు ఆశయం పరుగులు పెట్టే అవకాశం ఉంటుంది.

# మెగాస్టారే కాదు..మద్రాసు పుట్టిందీ ఈరోజే..హైదరాబాద్ కంటే చిన్నదే



**హైదరాబాద్ పెన్ పవర్:** మదరాసీ.. ఈ పదం ఒకప్పుడు దక్షిణ భారతదేశానికి ప్రతీక..! తమిళనాడు, ఏపీ, తెలంగాణ, కర్ణాటక, కేరళ ఎక్కడివారైనా సరే.. ఢిల్లీ వెళ్తే మదరాసీ అనే అనేవారట..! అలాంటి నగరం కాలక్రమేణా చెన్నపట్టణం నుంచి చెన్నైగా మారింది... 30 ఏళ్ల కిందట మద్రాస్ పేరు చెన్నైగా మార్చినప్పుడు అందరూ కాస్త పలికేందుకు ఇబ్బంది పడ్డారు. ఇప్పుడు మాత్రం అలవాటు పడ్డారు.ఆగస్టు 22ను టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజుగా అందరూ చూస్తారు... కానీ, ఈ రోజు మద్రాస్ పుట్టిన రోజు...! ఆఫ్ కోర్స్.. మెగాస్టార్ చిరంజీవి నటుడిగా పుట్టింది మద్రాస్ లోనే అనుకోండి. అందుకే ఏటా ఈ రోజున మద్రాస్ డే వేడుకలు నిర్వహిస్తుంటారు. ఈ సంప్రదాయం కూడా ఎప్పటినుంచో రాలేదు.. 2004 నుంచి మొదలైంది.

**ఇలా పుట్టింది మద్రాస్....**

బ్రిటిషర్లు మన దేశానికి వచ్చి ఈస్ట్ ఇండియా కంపెనీ పేరిట వ్యాపార కార్యకలాపాలు నిర్వహించసాగారు. అలాంటి సమయంలో 1639 ఆగస్టు 22న అప్పటి రాజు నుంచి కొంత భూమిని కొని సెయింట్ జార్జ్ కోటను నిర్మించారు. అలా దానిచుట్టూ స్థానికులు, బ్రిటిషర్లూ నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. చివరకు అదే పెద్ద మద్రాస్ గా ఎదిగింది. ఆగస్టు 29న ఈస్ట్ ఇండియా కంపెనీ భూమిని కొనుగోలు చేసింది కాబట్టి.. ఆ రోజును మద్రాస్ డే అంటూ 1939లో నిర్ణయించారు. కానీ, తర్వాత ఎవరూ పట్టించుకోలేదు.

**2004 నుంచి మొదలుపెట్టి...**

మద్రాస్ చారిత్రక నేపథ్యం, కల్చర్ ను కాపాడే ఉద్దేశంతో మైలాపోర్ టైమ్స్ పేపర్ ఎడిటర్ విన్సెంట్ డిసౌజా, ప్రెస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా ఎడిటర్ శశినాయర్, చరిత్రకారుడు ముత్తయ్య చొరవ చూపడంతో 2004 నుంచి క్రమం తప్పకుండా మద్రాస్ డేను నిర్వహిస్తున్నారు. అలా ఆగస్టు 22న నగరం చరిత్రను వివరిస్తూ, సదస్సులు, మారథాన్ పరుగు నిర్వహిస్తుంటారు. చారిత్ర కట్టడాలు, పర్యాటక ప్రదేశాల ప్రాముఖ్యతను వివరించేలా ఎగ్జిబిషన్లు, స్టాల్స్ ఏర్పాటు చేస్తుంటారు.

**సినీ నగరి.. ఆటోమొబైల్ రాజధాని..**

ఓ 25 ఏళ్ల కిందటి వరకు దేశంలోని నాలుగు ప్రధాన నగరాల్లో ఉష్ణోగ్రతలు అంటూ ఢిల్లీ, ముంబై, కోల్ కతాలతో పాటు చెన్నై పేరు చెప్పేవారు. అంటే, అప్పటికే చెన్నై దేశంలోని పెద్ద నగరాల్లో ఒకటిగా మారిందిన్నమాట. ఇక అమెరికాలో ఆటోమొబైల్ కు పేరుగాంచిన నిడెట్రాయిట్ తో చెన్నైను పోలుస్తారు. చెన్నై పారిశ్రామిక ప్రగతిని సూచించేలా ఇలా పిలుస్తారు. ఇక మరీ ఆసక్తికరం ఏమంటే.. 30 ఏళ్ల కిందటి వరకు చెన్నై (మద్రాస్) దక్షిణ భారత సినీ పరిశ్రమలు (తమిళ, కన్నడ, తెలుగు, మలయాళం) అన్నింటికీ కేంద్రం. ఆ తర్వాత ఒక్కోటి తమ సొంత రాష్ట్రాలకు వెళ్లిపోయాయి. అంటే.. ఒకప్పుడు విశ్వవిఖ్యాత నట సార్వభౌమ ఎన్టీఆర్ నుంచి కన్నడ కంఠీరవ రాజ్ కుమార్, తమిళ తెరవేల్పు ఎంజీఆర్ అందరూ చెన్నైలోనే ఉండేవారన్నమాట.

**మద్రాస్ కొరియర్... హైదరాబాద్ కంటే చిన్నదే..**

1996లో డీఎంకే ప్రభుత్వం మద్రాస్ పేరును చెన్నైగా మార్చింది. 'మద్రాస్ కొరియర్' అనేది ప్రపంచంలోనే రెండో అతి ప్రాచీన ఆంగ్ల పత్రిక. దీన్ని 1785లో ప్రారంభించారు. ఇప్పటికీ నడుస్తోంది.

ఇక మద్రాస్ పుట్టింది 1639లో అనుకుంటే దాని వయసు 386 ఏళ్లు. అంటే మన హైదరాబాద్ కంటే మద్రాస్ చిన్నదే అనుకోవాలి. ఎందుకంటే.. హైదరాబాద్ కు 1591లో మొహమ్మద్ కులీ కుతుబ్ సా చేతుల మీదుగా పునాదిరాయి పడింది. ఈ లెక్కన చూస్తే హైదరాబాద్ కంటే చెన్నై దాదాపు 50 ఏళ్లు చిన్నది. కానీ, హైదరాబాద్ కంటే ముందే పెద్ద నగరంగా ఎదిగింది. బహుశా సముద్రం తీరం ఉండడమే కారణం కావొచ్చేమో..?

# నవారో.. ట్రంప్ వాణిజ్య యుద్ధ వ్యూహకర్త.. భారత్ పాలిట విలన్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియా టారిఫ్‌ల మహారాజ్.. మనకు వస్తువులు అమ్మి.. ఆ డబ్బుతో రష్యా నుంచి చమురు కొని ఉక్రెయిన్ యుద్ధానికి పరోక్షంగా సహకరిస్తోంది.. ఈ మాటలు అన్నది ఏ శత్రు దేశం నాయకుడో కాదు..! సాక్షాత్తు అగ్ర రాజ్యం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నకు వాణిజ్య సలహాదారు. అసలు రెండు దేశాల మధ్య టారిఫ్‌ల వార్ కు ఆయనే సూత్రధారి అనడంలో సందేహం లేదు. ట్రంప్ విధించిన 50 శాతం టారిఫ్ ల అమలు ఈ నెల 27 నుంచి కాకుండా మరికొన్ని రోజులు వాయిదా పడుతుందని ఏమూలనో ఉన్న ఆశలను కూడా చిదిమేస్తున్నారు.

**ట్రంప్ ను ముంచే సలహాదారు....!**

అమెరికా అధ్యక్ష భవనం వైట్ హౌస్ సలహాదారు నవారో గురించి టెస్లా అధినేత మస్క్ ను అడిగితే బాగా చెబుతారు. అతడిని మూరు?డు అని కూడా అంటారు. ఇప్పుడ ఈ నవారోనే భారత్-అమెరికా సంబంధాలపై పెట్రోల్ చల్లుతున్నారు. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయడాన్ని తప్పుబడుతున్నారు. ప్లాన్ ప్రకారం రష్యా నుంచి చమురు కొంటూ భారత్ లాభపడుతోందని నిందిస్తున్నారు. భారత్ టారిఫ్ లు అధికం అని.. రష్యా చమురుతో ఆ దేశ రిఫైనరీలు అధిక లాభాలు గడిస్తున్నాయని ఆరోపించారు. అసలు భారత్ కు రష్యా చమురు అవసరం లేదని అంటున్నారు. రష్యా పట్ల ఆ దేశం వైఖరి మార్చుకోవాలని సూచిస్తున్నారు.

**సంబంధాలను దెబ్బతీసేలా...**

భారత్-అమెరికా సంబంధాలు గత మూడు దశాబ్దాలుగా బలపడుతున్నాయి. వాటిని నవారో తన వివాదాస్పద ప్రకటనల ద్వారా విచ్ఛిన్నం చేస్తున్నారనే అభిప్రాయం నెలకొంది. అయితే, ట్రంప్ ఇచ్చిన స్వేచ్ఛ నవారోకు పట్ట పగ్గాలు లేకుండా చేస్తోంది. 75 ఏళ్ల నవారో ట్రంప్ తొలిసారి అధ్యక్షుడు అయినప్పుడు కూడా వాణిజ్య సలహాదారుగా ఉన్నారు. అయితే, ఆయన పవర్తన ట్రంప్ సొంత పార్టీ రిపబ్లికన్లకే నచ్చడం లేదు. ఒకప్పటి డెమోక్రాట్ అయిన నవారో.. వియత్నాంపై అమెరికా సాగించిన యుద్ధాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. కాలిఫోర్నియాలో ఉద్యమాలు చేశారు. ప్రఖ్యాత హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో ఎకనామిక్స్ లో పీహెచ్డీ చేసిన నవారోకు ఎన్నికల్లో గెలిచిన చరిత్ర లేదు.

**మస్క నే వెళ్లగొట్టిన మొనగాడు...**

-1990ల్లో జాతీయవాదిగా మారిన నవారో... స్వేచ్ఛా వాణిజ్యాన్ని వ్యతిరేకిస్తూ, రక్షణాత్మక వాణిజ్య విధానాలను సమర్థించడం చేశారు. ట్రంప్ రెండోసారి అధ్యక్షుడు అయ్యాక కూడా వాణిజ్య సలహాదారుగా నియమితులైన నవారో... ఎలాన్ మస్క్ ను ట్రంప్ నకు దూరం చేశారు. వస్తూనే అల్యూమినియం దిగుమతులపై 25శాతం సుంకం విధించడంలో కీలక పాత్ర పోషించారు. విదేశాల్లో తయారైన విడిభాగాలతో అమెరికాలో కార్లు తయారు చేస్తారని మస్క్ ను నిందించి.. ఆయనను కార్ అసెంబ్లర్ అంటూ దూషించారు.

-భారత్ పై టారిఫ్ ల విషయంలో ట్రంప్ ను రెచ్చగొడుతున్నది నవారోనే అని అభిప్రాయం. లిలిరష్యా-ఉక్రెయిన్ యుద్ధం ఆగితే ట్రంప్ నకు నోబెల్ శాంతి బహుమతి వస్తుంది. అది జరగాలంటే.. ఒత్తిడి పెంచేలా రష్యా నుంచి భారత్ చమురు కొనకూడదులిలి అనేది నవారో విచిత్ర ప్రతిపాదన.

-2020లో ట్రంప్ రెండోసారి అధ్యక్ష ఎన్నికకు పోటీ చేసి ఓడిపోయాక క్యాపిటల్ హిల్స్ వద్ద ఆయన మద్దతుదారులు సమావేశమై అనంతరం అల్లర్లకు దిగారు. ఇందులో నవారోనే కీలకంగా పేర్కొంటారు. అందుకే ఆయనను అమెరికా కాంగ్రెస్ విచారణకు పిలిచింది. కానీ, ఆయన వెళ్లలేదు. దీంతో నాలుగు నెలల జైలు శిక్ష విధించగా నవారో దానిని అనుభవించారు.

# టీడీపీ పార్టీ క్యాడర్ వీక్...గవర్నమెంట్ స్ట్రాంగ్...నెక్ట్స్ పరిస్థితి ఏంటి ?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఎలా ఉంది అంటే బలంగానే ఉంది అని జవాబు వస్తుంది. చంద్రబాబు అసలే వ్యూహకర్త. ఆయనకు తోడు అన్నట్లుగా మరో రెండు పార్టీలు వచ్చి చేరాయి. దాంతో మూడు పార్టీలతో ఏర్పడిన కూటమి ప్రభుత్వం అత్యంత పటిష్టంగా ఉంది. పైగా బాబు అనుభవశాలి కావడంతో కూటమిలో ఎలాంటి లుకలుకలు లేకుండా చూసుకుంటున్నారు. అంతా ఒక మాట ఒకే బాటగా ముందుకు సాగుతున్నారు.

**సూపర్ సిక్స్ తో దూకుడు :**

ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలలో మెజారిటీని టీడీపీ ప్రభుత్వం అమలు చేసి చూపించింది. సాధారణంగా టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను పెద్దగా నిలబెట్టుకోలేదని ఒక విమర్శ ఉంది. ఈసారి మాత్రం అలాంటిది ఏదీ లేకుండా సాధ్యమైనంత త్వరగానే హామీలను నెరవేర్చడం ద్వారా టీడీపీ కూటమి ప్రభుత్వం తన నిబద్ధతను చాటుకుంది. సూపర్ సిక్స్ హామీలు కూటమి ప్రభుత్వం నెరవేర్చలేదని వైసీపీ భావించినా అలాంటిది ఏదీ లేదని నిరూపించింది. దాంతో సూపర్ సిక్స్ హామీలతో కూటమి ప్రభుత్వం పూర్తి బలంగా ఉంది అని నివేదికలు వస్తున్నాయి.

**దూసుకుని పోతున్న వేళ :**

అలా కూటమి ప్రభుత్వం బ్రేకుల్లేని బండిగా దూసుకుని పోతున్న వేళ టీడీపీకి అడ్డా అవాంతరాలు విపక్షాల నుంచి అయితే రావడం లేదు అని అంటున్నారు. మరెక్కడ నుంచి అంటే పార్టీ క్యాడర్ నుంచే అని చెబుతున్నారు. వింతగా విచిత్రంగా ఉన్నా ఇదే నిజం అని అంటున్నారు. ఎంతో క్రమశిక్షణ కలిగిన తెలుగుదేశం పార్టీలో కార్యకర్తలు ఎందుకు ఈ విధంగా వ్యవహరిస్తున్నారు అంటే మాకెందుకు అన్న నిర్లిప్తతతో ఉంటున్నారు అని అంటున్నారు. పనిచేయడం లేదని అంటున్నారు. వైసీపీలో క్యాడర్ సహాయ నిరాకరణ ఎలా ఉందో అచ్చం అలాగే టీడీపీలో ఉంది అని అంటున్నారు.

**కేసులు ఎందుకు పెట్టించుకోవాలి :**

మరీ దూకుడు చేస్తూ జనంలో ఉంటూ గట్టిగా పనిచేస్తే రేపటి రోజున వైసీపీ ప్రభుత్వం వస్తే తమ మీద కేసులు పడతాయని కార్యకర్తలు అంటున్నారని టాక్ ఉందిట. అంతే కాదు ప్రభుత్వం పథకాల మీద దృష్టితో ఉంది. దాంతో క్యాడర్ తో గ్యాప్ అయితే వస్తోంది అని అంటున్నారు. ఇక ఎమ్మెల్యేల తీరు చూస్తే అది కూడా ఇబ్బందిగానే ఉంది అని అంటున్నారు. ఎవరి స్థాయిలో వారు చేస్తున్న దూకుడు వల్ల అవినీతి ఎక్కువగా గ్రౌండ్ లెవెల్ లో ఉందని అంటున్నారు. ఎమ్మెల్యేల అవినీతి మీద కథలు కథలుగా వస్తున్నా చంద్రబాబు అయితే సరైన యాక్షన్ తీసుకోవడం లేదు అన్న చర్చ కూడా ఉంది. బహుశా ఈ రకమైన ధైర్యం వల్లనే వారు మరింత స్పీడ్ పెంచి తమకు తోచినట్లుగా వ్యవహరిస్తున్నారు అని అంటున్నారు.

**ప్రభుత్వానికే మార్కులు కానీ :**

ప్రభుత్వం బాగానే పనిచేస్తోంది అన్నది సాదర జనంలో వస్తున్న మాట. ఆ విధంగా మంచి మార్కులు పడుతున్నాయి. కానీ పార్టీ తీరే టీడీపీలో బాగా లేదని అంటున్నారు. క్షేత్ర స్థాయిలో జరుగుతున్నది పై స్థాయికి తెలియదా తెలిసినా యాక్షన్ తీసుకోలేకపోతున్నారా అన్నదే అంతా ఆలోచిస్తున్నారు. ఇక ఎమ్మెల్యేలు చాలా మంది పార్టీ ఆఫీసు ముఖం కూడా చూడడం లేదంటే ఆలోచించుకోవాల్సిందే అని అంటున్నారు. సంపాదనలో పడిన నేపథ్యంలో వారి వల్లనే జనంలో వ్యతిరేకత అయితే వేగంగా వస్తోంది అంటున్నారు.

ఎంత ప్రభుత్వం బాగా పనిచేసినా పార్టీ తీరు కూడా బాగుంటేనే మేలు జరుగుతుందని అంటున్నారు. అందువల్ల పార్టీని కూడా సూపర్ అనేలా హైకమాండ్ సరైన చర్యలు తీసుకోవాలని అంటున్నారు. లేకపోతే తర్వాత పరిస్థితి ఏమిటి అన్నదే పెద్ద ప్రశ్నగా మిగిలిపోతుందని అంటున్నారు. ఈ విషయంలో అయితే ఎవరికి వారుగానే పార్టీ హితైషులుగా సలహాలు సూచనలు ఇస్తున్నారు. మరి పెద్దలు ఫోకస్ పెట్టాల్సిందే అంటున్నారు. సో మొత్తానికి అదన్న మాట అసలు మ్యాటర్.

### యుఎస్ ఓపెన్ డ్రా రిలీజ్.. అందరి చూపు ఆ ముగ్గురిపైనే..

## తొలి రౌండ్‌లోనే జొకోవిచ్‌కు టఫ్ ఫైట్



**హైదరాబాద్ పెన్ పవర్:** టెన్నిస్ ఫ్యాన్స్ ఎంతగానో ఎదురు చూస్తున్న యూఎస్ ఓపెన్ డ్రా వచ్చేసింది. ఆదివారం (ఆగస్టు 24) నుంచి మొదటి రౌండ్ మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి. డిఫెండింగ్ ఛాంపియన్ గా వరల్డ్ నెంబర్ వన్ ప్లేయర్ సిన్నర్ బరిలోకి దిగనున్నాడు. హార్డ్ కోర్ట్ లో తిరుగులేకుండా దూసుకెళు_న్న సిన్నర్ మరో టైటిల్ పై కన్నేశాడు. 2024లో హార్డ్ కోర్ట్ లో జరిగిన రెండు గ్రాండ్ స్లామ్స్ టైటిల్స్ తో పాటు ఈ ఏడాది హార్డ్ కోర్ట్ లో జరిగిన ఆస్ట్రేలియా ఓపెన్ ను సిన్నర్ కైవసం చేసుకున్నాడు. తిరుగులేని ఫామ్ లో ఉన్న ఈ ఇటలీ ప్లేయర్ హాట్ ఫేవరేట్ గా బరిలోకి దిగబోతున్నాడు. తొలి రౌండ్ లో కోప్రివ్ తో సిన్నర్ టైటిల్ వేట ప్రారంభించనున్నాడు. జొకోవిచ్, అల్కరాజ్ లేకపోవడంతో తన డ్రా లో లేకపోవడంతో అలవోకగా ఫైనల్ కు చేరుకునే అవకాశం కనిపిస్తోంది. సెర్బియా లెజెండ్ నోవాక్ జొకోవిచ్ 38 ఏళ్ళ వయసులో గ్రాండ్ స్లామ్ సాధించాలని ఆరాటపడుతున్నాడు. జొకోవిచ్ కు రెండేళ్లుగా గ్రాండ్ స్లామ్ టైటిల్ లేదు. ఎలాగైనా యూఎస్ ఓపెన్ గెలిచి తిరిగి పుంజుకోవాలని భావిస్తున్నాడు. తొలి రౌండ్ లోనే ఈ సెర్బియా స్టార్ కు కఠినమైన డ్రా ఎదురైంది. 19 ఏళ్ళ లెర్నర్ టియెన్‌తో తన తొలి మ్యాచ్ ఆడనున్నాడు. టియెన్ 2025 ఆస్ట్రేలియన్ ఓపెన్ నాలుగో రౌండ్ లో డేనియల్ మెద్వెదేవ్‌ను ఓడించాడు.

స్పెయిన్ స్టార్ కార్లోస్ అల్కరాజ్‌తో రీల్లీ ఒపెల్కాతో తన తొలి మ్యాచ్ ఆడనున్నాడు. నాలుగో రౌండ్ లో 2021 ఛాంపియన్ డేనియల్ మెద్వెదేవ్ తో తలపడే అవకాశం ఉంది. ఇటీవలే టొరంటో టైటిల్ గెలిచి ఊపు మీదున్న బెన్ షెల్టన్ లేదా 2022 ఫైనలిస్ట్ కాస్పర్ రూడ్ లలో ఒకరితో క్వార్టర్ ఫైనల్స్ ఆడనున్నాడు. సెమీస్ లో జొకోవిచ్, ఫైనల్లో సిన్నర్ ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయి. టేలర్ ఫ్రిట్జ్,అలెగ్జాండర్ జ్వెరెవ్, జాక్ డ్రేపర్,బెన్ షెల్టన్ తొలి గ్రాండ్ స్లామ్ సింగిల్స్ టైటిల్ గెలవాలనే ఆశతో ఉన్నారు. 2014 ఛాంపియన్ మారిన్ సిలిక్ అలెగ్జాండర్ బుబ్లిక్‌తో తలపడనున్నాడు.

## అసాధ్యం అనుకుంటే అద్భుతం జరిగింది.. 29 బంతుల్లోనే 102 పరుగులు ఫినిష్



**హైదరాబాద్ పెన్ పవర్:** టార్గెట్ 40 బంతుల్లో 102 పరుగులు.. కొట్టాల్సిన రన్ రేట్ 15 ఉంది. క్రీజ్ లో పెద్దగా హిట్టింగ్ చేయలేని జోర్డాన్ కాక్స్, సామ్ కరణ్. ఇలాంటి పరిస్థుల మధ్య ఆ జట్టు గెలవడం దాదాపుగా అసాధ్యం. ఒకవేళ గెలిచినా చివరి వరకు మ్యాచ్ వెళ్లడం ఖాయం. కానీ హండ్రెడ్ లీగ్ లో సంచలనం చోటు చేసుకుంది. ట్రెంట్ రాకెట్స్ పై ఓవల్ ఇన్విన్సిబుల్స్ అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది. చివరి 40 బంతుల్లో 102 పరుగులు చేయాల్సిన దశలో టార్గెట్ మరో 11 బంతులు మిగిలించి ఫినిష్ చేయడం హైలెట్ గా మారింది. జోర్డాన్ కాక్స్ (58), సామ్ కుర్రాన్ (54) ధాటికి ట్రెంట్ రాకెట్స్ బౌలర్ల వద్ద సమాధానమే లేకుండా పోయింది. ఛేజింగ్ లో ఓవల్ ఇన్విన్సిబుల్స్ కు మంచి ఆరంభం దక్కలేదు. మొదటి 60 బంతులు ముగిసేసరికి కేవలం 70 పరుగులు మాత్రమే చేసింది. అయితే ఇక్కడ నుంచి అసలు విధ్వంసం మొదలైంది. 60 నుంచి 65 మధ్య 19 పరుగులు వచ్చాయి. కాక్స్ ఒక సిక్స్ కొడితే కరణ్ రెండు సిక్సర్లకు కొట్టాడు. ఆ తర్వాత సామ్ కుక్ వేసిన ఓవర్లో ఏకంగా 32 పరుగులు వచ్చాయి. అతను వేసిన 5 బంతుల్లో ఏకంగా 32 పరుగులు రావడంతో మ్యాచ్ ఒక్కసారిగా ఇన్విన్సిబుల్స్ వైపు మళ్లింది. రెండు 60 నుంచి 70 బంతుల మధ్య 51 పరుగులు రావడం విశేషం. స్టయినీస్ (81-85) వేసిన ఓవర్లో 25 పరుగులు రావడంతో మ్యాచ్ పై ట్రెంట్ రాకెట్స్ ఆశలు వదిలేసుకుంది. 87, 88 బంతులకు ఫోర్లు కొట్టి కాక్స్ జట్టుకు థ్రిల్లింగ్ విక్టరీ అందించాడు. అంతకముందు మొదట బ్యాటింగ్ చేసిన ట్రెంట్ రాకెట్స్ నిర్ణీత 100 బంతుల్లో 7 వికెట్లకు 171 పరుగులు చేసింది. రాకెట్స్ ఇన్నింగ్స్‌ను జో రూట్ (41 బంతుల్లో 76) టాప్ స్కోరర్ గా నిలిచాడు. లిండే 8 బంతుల్లో మూడు సిక్సర్లు, ఒక ఫోర్ తో 25 పరుగులు చేసి మెరుపులు మెరిపించాడు. లక్ష్య ఛేదనలో ఓవల్ ఇన్విన్సిబుల్స్ మరో 11 బంతులు మిగిలి ఉండగానే 4 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసి విజయం సాధించింది.

## చిన్నస్వామిలో వరల్డ్ కప్ మ్యాచ్‌లు లేవు.. వేరే స్టేడియానికి తరలించిన ఐసీసీ



**హైదరాబాద్ పెన్ పవర్:** సెప్టెంబట్ 30 నుంచి ప్రారంభం కానున్న ఐసీసీ విమెన్స్ వరల్డ్ కప్ వేదికలో స్వల్ప మార్పు చోటు చేసుకుంది. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నీకి బెంగళూరులోని ఐకానిక్ ఎం. చిన్నస్వామి స్టేడియం ఆతిథ్య హక్కులను కోల్పోయింది. ఈ స్టేడియంలో మ్యాచ్ లు జరగవని ఐసీసీ శుక్రవారం (ఆగస్టు 22) కన్ఫర్మ్ చేసింది. 2025 జూన్ 4న చిన్నస్వామి స్టేడియంలో విషాదం చోటు చేసుకోవడమే ఇందుకు కారణం. చిన్నస్వామి స్టేడియంలో ఐపీఎల్ విజయోత్సవ వేడుకల తర్వాత జరిగిన తొక్కిసలాటలో 11 మంది ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. 32000 సీటింగ్ కెపాసిటీ ఉన్న చిన్నస్వామి స్టేడియంలో ఇకపై క్రికెట్ ఆడే సూచనలు కనిపించడం లేదు. ఇందులో భాగంగా ఈ స్టేడియంలో వరల్డ్ కప్ మ్యాచ్ లు కూడా వేరే స్టేడియానికి మార్చారు. ఈ స్టేడియంలో జరగాల్సిన ఐదు మ్యాచ్‌లను ఇప్పుడు నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియంకు తరలించారు. షెడ్యూల్ ప్రకారం టోర్నమెంట్ తొలి మ్యాచ్ తో పాటు సెమీఫైనల్ జరగాల్సి ఉంది. “ఊహించని పరిస్థితుల కారణంగా షెడ్యూల్‌ను సర్దుబాటు చేసి వేదికను మార్చాల్సి వచ్చింది. అత్యుత్తమ మ్యాచ్ లను అందించగలిగే ఐదు ప్రపంచ స్థాయి వేడుకలు ఉండడం మాకు సంతోషంగా ఉంది”.అని ఐసిసి చైర్మన్ జే షా అన్నారు.ఇండియా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, శ్రీలంక, బంగ్లాదేశ్, పాకిస్తాన్ .. ఈ జట్లు వరల్డ్ కప్ కోసం పోటీ పడనున్నాయి. ఆస్ట్రేలియా డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతోంది. సొంత దేశంలో టోర్నీ కావడంతో భారత్ హాట్ ఫేవరెట్. భారత్ చివరగా 2013లో ప్రపంచ్ కప్?కు ఆతిథ్యం ఇవ్వగా.. ఈ టోర్నీలో ఇండియా ఉమెన్స్ టీమ్ గ్రూప్ దశలోనే నిష్క్రమించింది. 2017లో లార్డ్స్‌లో జరిగిన ఫైనల్‌లో ఇంగ్లాండ్ చేతిలో ఓడిపోవడంతో వన్డే వరల్డ్ కప్ భారత మహిళలకు కలగానే మిగిలింది. ఈ సారి టోర్నీ భారత్?లోనే జరుగుతుండటంతో హర్మన్‌ప్రీత్ కౌర్ సేన టైటిలే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. మొత్తం ఎనిమిది జట్లు పాల్గొనే ఈ టోర్నీ 2025, సెప్టెంబర్ 30 నుంచి 2025 నవంబర్ 2 వరకు భారత్, శ్రీలంకలోని ఐదు వేదికలలో హైబ్రిడ్ మోడ్?లో జరగనున్నట్లు ఐసీసీ వెల్లడించింది. భారత్?లోని ముంబై, గౌహతి, ఇండోర్, విశాఖపట్నం స్టేడియాల్లో మ్యాచులు జరగనున్నాయి. పాకిస్తాన్ తమ మ్యాచ్‌లను శ్రీలంక కొలంబోలోని ఆర్ ప్రేమదాస స్టేడియంలో ఆడనుంది. భద్రతా కారణాల దృష్ట్యా పాక్ వెళ్లేందుకు భారత జట్టు నిరాకరించింది. దీంతో టోర్నీని హైబ్రిడ్ మోడ్?లో నిర్వహించి.. భారత్ ఆడే మ్యాచులను దుబాయ్ వేదికగా నిర్వహించారు.

## నటవారసుడంటే పడి చస్తున్న లారిస్సా బోనెస్సి

పూనమ్ బజ్వా ఫ్యాషన్‌కి నిప్పు పెడుతోంది





సోనమ్ బజ్వా దీవెనలలో నివసిస్తున్నారు



కింగ్ ఖాన్ షారూఖ్ వారసుడు ఆర్యన్ ఖాన్ తెరకెక్కించిన ‘ది బాలిలిలిడ్స్ ఆఫ్ బాలీవుడ్’ ప్రోమో ఇటీవల విడుదలైన సంగతి తెలిసిందే. ఈ ప్రోమోలో దర్శకుడిగా ఆర్యన్ ఖాన్ ప్రతిభను చూపాడని ఇండస్ట్రీ వర్గాలు ప్రశంసించాయి. ముఖ్యంగా టీజర్ విడుదలైన తర్వాత, కరణ్ జోహార్ - అనన్య పాండే సహా పలువురు సినీ ప్రముఖులు ఆర్యన్‌ను ప్రశంసలతో ముంచెత్తారు. వెబ్ సిరీస్ రాక కోసం ఎగ్జయిటింగ్ గా వేచి చూస్తున్నామని ప్రకటించారు.

అయితే ఇండస్ట్రీ వర్గాల నుంచి ప్రశంసల సంగతి అటుంచితే, ఆర్యన్ జీవితంలో అత్యంత ముఖ్యమైన వ్యక్తి లారిస్సా బోనెస్సీ ప్రశంస గురించే ప్రపంచం ఎక్కువగా పట్టించుకుంటోంది. ఆర్యన్ విదేశీ బ్యూటీ లారిస్సాతో డేటింగ్ చేస్తున్నట్లు పుకార్లు చాలా కాలంగా ఉన్నాయి. బ్రెజిలియన్ బ్యూటీ ఆర్యన్ తో సాన్నిహిత్యాన్ని ఎక్కువగా కోరుకుంటోంది. అందుకే ఇప్పుడు లారిస్సా పొగడ్త మీడియా హెడ్ లైన్స్ లోకి వచ్చింది.

ఇంతకీ లారిస్సా ఏమని పొగిడేసింది? అంటే... టీజర్ యూట్యూబ్ లో విడుదల కాగానే... “అన్‌స్టాపబుల్.., సాటిలేనిది.. నిజంగా ప్రపంచంలో చ1! గర్వించదగిన ప్రయత్నం.. తక్కువ అంచనాతో ఎక్కువగా రీచ్ అవుతుంది!” అంటూ వ్యాఖ్యను జోడించింది. ఆర్యన్ విషయంలో లారిస్సా మరీ ఇంతగా ఎందుకు ఎమోషనల్ అవుతోంది? అనేది అందరిలో సందిగ్ధతను నింపుతోంది. అసలింతకీ ఆర్యన్ తో లారిస్సా బాండింగ్ ఎలాంటిది? అనేది స్పష్టం కావాల్సి ఉందని నెటిజనులు వ్యాఖ్యానిస్తున్నారు.లారిస్సా బోనెసి ఎవరు? అంటే.. ప్రముఖ నటి కం మోడల్. 1990 మార్చి 28న బ్రెజిల్‌లో జన్మించిన ఈ బ్యూటీ బాలీవుడ్, టాలీవుడ్ కి సుపరిచితురాలు. రాజ్ అండ్ డి.కె 2013 యాక్షన్ కామెడీ ‘గో గోవా గాన్’లో కనిపించింది. టాలీవుడ్ లో సాయి ధరమ్ తేజ్ యాక్షన్-కామెడీ తిక్కలో కథానాయికగా ఆడిపాడింది. ఇవేగాక కొన్ని సౌత్ సినిమాల్లోను నటించింది. ఓలే, లాంకోమ్, లెవిస్ వంటి కొన్ని టాప్ బ్రాండ్స్ ప్రకటనల ప్రచారాలలో కూడా భాగమైంది.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com